J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS





లాయర్

సంపుటి : 41 సంచిక : 11 20.8.2021, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## నేతల మధ్య లోపించిన సమన్వయం

# పార్టీలో అయోమయం



**ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైయస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్ళు గడవబోతోంది. అంటే తొలి అయిదేళ్ళ పాలనలో అర్ధభాగం అన్నమాట. పార్టీ పూర్తిగా జగన్‌మోహన్‌రెడ్డి కనుసన్నలలో నడుస్తుందని, నాయకగణం మొత్తం అయన పట్ల భయం, భక్తి కలిగి ఉంటారని భావించిన వారి అంచనాలన్నీ తారుమారయ్యాయి. అగ్రనాయకుడిని నేరుగా కలిసే అవకాశమే ఎవరికీ లేకపోవడంతో, మిగిలినవారు ఆడిందే ఆట పాడిందే పాటగా మారిపోయింది.**

రాష్ట్రంలో గతంలో ఎన్నడూ కనీవినీ ఎరుగని పరిస్థితులు ఇప్పుడు ఆంధ్ర రాజకీయాలలో దర్శనమిస్తున్నాయి. మనదంతా ఒకే పార్టీ... మనకంతా ఒకడే నాయకుడు అన్న విధానం కనుమరుగై, వైసిపిలో గెలిచిన నాయకులంతా ఎవరికి వారే తామే పార్టీ, తామే నాయకులమన్న తీరులో వ్యవహరిస్తున్న విధానం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. పేరుకి రాష్ట్రానికి ఒక ముఖ్యమంత్రి 25 మంది మంత్రులూ ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి మినహా మిగిలిన మంత్రులు సైతం ఇతరుల నియోజకవర్గాలలో జోక్యం చేసుకోవడానికి ధైర్యం చేయడం లేదు. ఆయా నియోజకవర్గాల శాసనసభ్యులు సైతం తమ నియోజకవర్గాలలో మంత్రుల జోక్యాన్ని ఇష్టపడడంలేదు.

ఒక్క నెల్లూరుజిల్లానే ఉదాహరణగా తీసుకుంటే జిల్లాలో ఒక రాజ్యసభ సభ్యుడు, ఒక పార్లమెంటు సభ్యుడితో పాటు ఇతర జిల్లాల పార్లమెంటు నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న మరో ఇద్దరు పార్లమెంటు సభ్యులు కూడా ఈ జిల్లా పరిధిలోకి వస్తారు. వీరితో పాటు పది మంది శాసనసభ్యులు, ఒక శాసనమండలి సభ్యుడు ఉన్నారు. పది మంది శాసనసభ్యులలో ఇద్దరు మంత్రులుగా ఉన్నారు. ఇదీ ప్రస్తుత జిల్లా రాజకీయ ముఖచిత్రం. కానీ ఇక్కడ ఎవరినీ ఎవరూ అదుపుచేసే పరిస్థితి లేదు. ఎవరికివారే యమునా తీరే.. అన్న చందంగా వీరి వ్యవహారశైలి ఉంటుంది. తాము కలలో కూడా ఊహించని స్థాయిలో ప్రజలు తమ పార్టీకి అధికారం కట్టబెట్టడంతో వీరికి కన్నూమిన్నూ కానడంలేదు.

మొదటినుండి పార్టీ పెద్దగా వ్యహరిస్తున్న రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి కూడా ఇప్పుడు మౌనం వహిస్తున్నారు. ఆయన వేరే జిల్లాల బాధ్యతలు చూస్తుండడమే కాకుండా నెల్లూరుజిల్లాకు సజ్జల, మంత్రి బాలినేని ఇన్‌ఛార్జులుగా ఉండడంతో నెల్లూరుపై విపిఆర్ పెద్దగా దృష్టి పెట్టడంలేదు. ముఖ్యమంత్రితో ఆయనకున్న అత్యంత సన్నిహిత సంబంధాలతో తనకు బాగా కావలసినవారికి అవసరమైన పదవులను ఇప్పించడం వరకే ఆయన పరిమితమయ్యారు తప్ప జిల్లాలో జరుగుతున్న అరాచకాలను ప్రశ్నించే

10లో



రోడ్ నెం.2, 2వ మెయిన్‌రోడ్డు, మాగుంట లే అవుట్, నెల్లూరు. సెల్: 8919714848, 9618069769

# పుట్టికి 850 కిలోలే తీసుకోవాలి

## - మాజీమంత్రి సోమిరెడ్డి



జిల్లాలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్న ప్రభుత్వం పుట్టికి 850 కిలోల వంతున మాత్రమే తీసుకోవాలని మాజీమంత్రి, టిడిపి నాయకుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఒక లేఖలో జిల్లా కలెక్టర్‌ను కోరారు. గతంలో పుట్టికి 850 కిలోలకు బదులు రైతుల నుంచి 1050 నుంచి 1250 కిలోల దాకా తీసుకున్నారని, ఇది అన్యాయమని ఆయన పేర్కొన్నారు. ఈసారి అలాంటి పరిస్థితి రాకుండా చూడాలన్నారు. ధాన్యానికి కనీస మద్దతు ధర ఇవ్వాలని, గత సీజన్‌కు సంబంధించిన ధాన్యం బకాయిలను రైతులకు వెంటనే చెల్లించాలని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. జిల్లాలో రైతులు పండించిన ఎంటియు రకం ధాన్యాన్ని కూడా ప్రభుత్వం ఎలాంటి ఆంక్షలు లేకుండా కొనుగోలు చేయాలని కోరారు.

# ఎన్‌బికెఆర్‌లో స్వాతంత్ర్య సంబరాలు



75వ స్వతంత్ర దినోత్సవ వేడుకలను ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డా. వి.విజయ్‌కుమార్‌రెడ్డి జాతీయజెండాను ఆవిష్కరించి ఎన్‌సిసి క్యాడెట్ల నుండి గౌరవ వందనం స్వీకరించారు. దేశ ప్రజలందరూ స్వాతంత్ర సమరయోధులను ప్రేరణగా తీసుకుని దేశ ప్రగతికి తమవంతు పాత్ర పోషించాలన్నారు. మహనీయుల ప్రాణత్యాగాలతో సాధించుకున్న స్వాతంత్ర్యాన్ని దేశ అభివృద్ధి కోసం వినియోగించాలని, ప్రతిఒక్కరు తమ బాధ్యతను సక్రమంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. దేశ ప్రగతిలో ఎన్‌బికెఆర్ ఇంజినీరింగ్ కళాశాల తనవంతు బాధ్యతగా భావిభారత పౌరులను, ఇంజనీర్లను తయారుచేస్తోందన్నారు. కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్ కళాశాల సిబ్బందికి విద్యార్థులకు ఈ సందర్భంగా స్వాతంత్ర్య దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. వివిధ విభాగాధిపతులు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, ఎన్‌సిసి ఆధికారి లెఫ్టినెంట్ మాధవయ్య, విద్యార్థులు, ఎన్‌సిసి క్యాడెట్లు పాల్గొన్నారు.

# స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం

జిల్లా కలెక్టర్ ఈనెల 16వ తేది సోమవారం నాడు కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 35 అర్జీలు వచ్చాయి. అర్జీదారులు జిల్లా కలెక్టర్‌కు తమ సమస్యలు విన్నవించుకున్నారు. స్పందన అర్జీలను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ చక్రధర్‌బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్‌తో పాటు జేసీలు హరేందిరప్రసాద్, గణేష్‌కుమార్, విదేహ్ ఖరే, రోజ్‌మాండ్, డిఆర్‌ఓ చిన్నఓబులేశు తదితరులు పాల్గొని ఆ అర్జీలను పరిశీలించి పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు వెంటనే ఆదేశాలివ్వడంతో అర్జీదారులు సంతోషించారు.

# 'నాడు-నేడు' అవార్డులు

ప్రభుత్వం పాఠశాలల బాగుకు నిర్వహిస్తున్న 'నాడు-నేడు' కార్యక్రమానికి సంబంధించిన పనులను ఉత్తమస్థాయిలో నిర్వహించిన ఇద్దరికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా 'నాడు-నేడు' ప్రతిభా అవార్డులు లభించాయి. విడవలూరు మండలంలో సమగ్ర శిక్ష అభియాన్ ఇంజనీర్ ఆర్.ఉమామహేశ్వరి, నెల్లూరు దర్గామిట్టలోని జడ్పీ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ ఎం. జయమ్మ ఈ అవార్డులను అందుకున్నారు. తూర్పు గోదావరి జిల్లా గన్నవరంలో ఇటీవల జరిగిన నాడు-నేడు పనుల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి జగన్ ఈ అవార్డులను వారికి అందజేశారు. విజేతలను జిల్లాలోని పలువురు ప్రముఖులు, అధికారులు అభినందించారు.

# బీసీలు రాజకీయంగా ఎదిగితేనే ప్రగతి



బీసీలు సంఘటితంగా రాజకీయంగా ఎదిగితేనే ప్రగతి సాధ్యమవుతుందని బీసి సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఈనెల 16న నెల్లూరు టౌన్‌హాలులో సర్దార్ గౌతు లచ్చన్న జయంతి కార్యక్రమం జరిగింది. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు బీసీ నాయకులు పాల్గొని వెనుకబడిన సంఘాల నేత సర్దార్ గౌతులచ్చన్నకు ఘన నివాళులర్పించారు. అనంతరం ఆ సంఘానికి జిల్లా శాఖ అధ్యక్షునిగా పల్లమాల శ్రీహరిరావును ఎన్నుకున్నారు. జడ్పీ మాజీ ఛైర్మెన్ చెంచలబాబుయాదవ్, రాధయ్య, విజయమ్మ, సుబ్రహ్మణ్యయాదవ్, సంపత్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమార్కుల గుండెల్లో.. దడ పుట్టిస్తున్న దాడులు

- ముమ్మరంగా సెబ్ అధికారుల తనిఖీలు
- 3174 కేసులు, 3562 మంది అరెస్ట్

***జిల్లాలో గత ఏడాది సెబ్ అధికారుల నియామకం జరిగినప్పటి నుంచి దాడులు, తనిఖీలు ముమ్మరమయ్యాయి. అసాంఘిక కార్యక్రమాలు, అక్రమాలకు ఎక్కడికక్కడ చెక్ పెట్టేస్తున్నారు. అక్రమ రవాణాలు, అవినీతి వ్యాపారాలు, అన్యాయాలతో అక్రమార్జనలకు పాల్పడుతున్న వారికి ఇప్పుడు సెబ్ పేరు వింటేనే గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నాయి. ఇప్పటిదాకా జిల్లాలో 3174 కేసులు నమోదయ్యాయి. ఈ కేసులకు సంబంధించి 3562 మందిని అరెస్ట్ చేశారు కూడా. జిల్లాలో ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోయిన అక్రమాలను అరికట్టేందుకు సెబ్ అధికారులు జేడీ శ్రీలక్ష్మి, జిల్లా ఎస్పీ విజయారావుల నేతృత్వంలో ప్రత్యేక నిఘా దృష్టి పెట్టడంతో..ఎక్కడ అధికారులకు పట్టుబడి ఊచలు లెక్కపెట్టాల్సి వస్తుందోనని అక్రమార్కుల గుండెలు గుభేలుమంటున్నాయి.***



నెల్లూరు సమీపంలో ఇటీవల దొరికిన బస్తాలకొద్దీ గుట్కాలు, ఖైనీలు (ఫైల్ ఫోటో)

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఇబి) అధికారులు జిల్లాలో అక్రమాలపై కొరడా ఝుళిపిస్తున్నారు. ముఖ్యంగా ఇసుక అక్రమ విక్రయాన్ని అరికట్టేందుకు పెద్దఎత్తున చర్యలు తీసుకుంటున్నారు. అక్రమంగా రవాణా అవుతున్న ఇసుక విషయంలో సెబ్ అధికారులు దృష్టిపెట్టి 17,709 టన్నుల ఇసుకను సీజ్ చేశారు. నెల్లూరు రూరల్ మండలం, బుచ్చిరెడ్డిపాళెం, ఇందుకూరుపేట, సూళ్ళూరుపేట, వాకాడు, ఆత్మకూరు తదితర ప్రాంతాల్లో ఇసుక అక్రమరవాణా జోరుగా సాగుతుండడాన్ని గమనించి దాడులు చేశారు. ఇప్పటిదాకా దీనికి సంబంధించి 825 కేసులు పెట్టి, 1517 మందిని అదుపులోకి తీసుకున్నారంటే చిన్న విషయమేమీ కాదు. అంతేకాక, అనధికార మద్యం విక్రయాలకు సంబంధించి దాడులు చేసి 1513 కేసులు నమోదు చేసి 1520 మందిని అరెస్ట్ చేశారు. అక్రమ మద్యాన్నంతా స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విక్రయాలను నిరోధించేందుకు రేయింబవళ్ళు కాపుకాసి గంజాయిని అక్రమరవాణా చేస్తున్న 35 మందిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి దాదాపు 500 కేజీలకు పైగానే గంజాయిని స్వాధీనం చేసుకుని అందరి ప్రశంసలు అందుకున్నారు.

### ● శెభాష్!.. సెబ్!..

### బస్తాలకొద్దీ నిషేధిత గుట్కాలు, ఖైనీలు

ఇటీవల నెల్లూరు రూరల్ మండలం వడ్డిపాళెం గ్రామంలో గుట్కాల స్థావరంపై సెబ్ అధికారులు దాడులు చేసి భారీ స్థాయిలో బస్తాలకొద్దీ అక్కడున్న నిషేధిత గుట్కాలను, ఖైనీలను కూడా స్వాధీనం చేసుకుని, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ యేడాది మొత్తంలో నిషేధిత గుట్కా విక్రయాలను అదుపు చేస్తూ 1513 కేసులు నమోదు చేసి 29,14,598 గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు.

### అక్రమాలకు పాల్పడితే వదిలే ప్రసక్తే లేదు

ఎవరైనాసరే అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే వదిలే ప్రసక్తే లేదని సెబ్ అధికారులు ఈ సందర్భంగా స్పష్టం చేస్తున్నారు. ముఖ్యంగా అనధికార మద్యం రవాణా-విక్రయాలు, నిషేధిత గుట్కాలు, గంజాయి విక్రయాలు, జూదం, వ్యభిచారం, ఇసుక, ఎర్రచందనం అక్రమ రవాణాలు వంటివాటికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇలాంటి చీకటికార్యకలాపాలు, అక్రమాలు ఎక్కడైనా జరుగుతున్నట్లు తెలిస్తే తమకు సమాచారం అందిస్తేచాలు.. వాటి అంతుచూస్తామంటున్నారు సెబ్ అధికారులు.

గతంలో కూడా అప్పుడప్పుడూ అధికారుల దాడులు జరుగుతుండేవి కానీ.. 'సెబ్' అధికారులు చేస్తున్నంత ముమ్మరంగా ఉండేవి కాదు. ఇప్పుడు జిల్లాలో దాదాపుగా ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట సెబ్ పేరు వినపడుతూనే ఉంది. అనేక ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు జోరుగా జరుగుతున్నాయి. సెబ్ దాడులు జిల్లాలో అక్రమార్కులకు దడ పుట్టిస్తున్నాయి. నిరంతరం నిఘాపెట్టి, అక్రమాలకు చెక్ పెట్టేందుకు సెబ్ అధికారులు చేస్తున్న కృషితో జిల్లాలో క్రమేణా అసాంఘిక కార్యక్రమాలు, అక్రమాలు బాగా తగ్గిపోతాయనే నమ్మకం ప్రజల్లో కలుగుతోంది. దీంతో శెభాష్!..సెబ్!.. అనిపించుకుంటున్నారు నెల్లూరుజిల్లాలోని సెబ్ అధికారులు.

# ఇకెవైసితో ఇక్కట్లు

### ○ ఆధార్ అప్‌డేట్ కోసం బారులు తీరిన జనం



ఆధార్ అప్‌డేట్ కోసం జనం బ్యాంకుల దగ్గర బారులు తీరుతున్నారు. ఇకెవైసి చేయించుకుంటే తప్ప రేషన్ పంపిణీ చేయడం కుదరదని అధికార వర్గాలు చెప్పడంతో సామాన్య ప్రజలు తమ రేషన్‌కార్డులను ఇకెవైసి చేయించుకునేందుకు నానా యాతనలు పడుతున్నారు. రేషన్‌కార్డుల్లో ఉన్న ప్రతి ఒక్కరికీ ఆధార్ అప్‌డేట్ అవ్వాలని, అలా కాకపోతే రేషన్ ఇవ్వరని తెలియడంతో ప్రజలు ఆధార్ కేంద్రాలు తెరవకముందే గుంపులు గుంపులుగా వస్తున్నారు. కరోనాని కూడా లెక్కచేయకుండా సామాజిక దూరం అనే విషయాన్నే మర్చిపోయి చంటి బిడ్డలను చంకలో వేసుకుని, వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ఆధార్ అప్‌డేట్ ప్రక్రియ కోసం ఆధార్ సెంటర్‌లకు జనం పరుగులు తీయడం ఈ నెల 16న తారసపడింది.

జిల్లా వ్యాప్తంగా ఆధార్ సెంటర్‌ల వద్ద ఇదే పరిస్థితి కనిపించింది. ఇకెవైసీ చేయకపోతే బియ్యం రావని అధికారులు, సచివాలయ సిబ్బంది ప్రచారం చేస్తుండడంతో దాని కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. జిల్లాలో అనేక మంది దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు అనారోగ్యం పాలైన వారు ఇకేవైసీ చేయించుకోలేకపోయారు. మరోవైపు ఆధార్ అప్‌డేట్ చేసుకొని ఇకెవైసీ చేయించుకోకపోతే వారి పేరును రేషన్‌కార్డ్ జాబితాలో నుంచి తొలగిస్తారన్న ప్రచారం జరుగుతోంది. దీంతో దూర ప్రాంతాల నుండి రావడం ఆధార్ సెంటర్ల వద్ద వేచి ఉండడం తమ శక్తికిమించిన పని అవుతోందని ప్రయాణ చార్జీలు, ఆహారానికి డబ్బులు, పని మానుకుని ఇక్కడ వేచి ఉండడం ఇవన్నీ సామాన్యులమైన తమ మీద అధిక భారమే అవుతాయని ప్రజలు వాపోతున్నారు.

ఇకనైనా అధికారులు స్పందించి ఆధార్ కేంద్రాల వద్ద రద్దీ తగ్గించడంతో పాటు, ఆధార్ అప్‌డేట్‌ను సచివాలయాలకు అనుసంధానం చేస్తే ఎక్కడివాళ్లు అక్కడే జాగ్రత్తగా ఆధార్ అప్‌డేట్ చేసుకుంటారని, అలాగే ఆధార్ సెంటర్లు పెంచి కోవిడ్ వ్యాప్తి కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

# విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, విద్యార్థులు కష్టపడి చదువుకుని సమున్నత స్థాయిలో రాణించాలని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆకాంక్షించారు. కోవూరులోని జడ్పీ బాలికోన్నత పాఠశాల ఆవరణంలో ఈనెల 18న ఆయన జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులకు అందించి మాట్లాడారు. విద్యలో నాణ్యతా ప్రమాణాలను పెంపొందించి అంతర్జాతీయస్థాయిలో విద్యార్థులు రాణించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విధాల కృషి చేస్తున్నారని ఆయన చెప్పారు. కోవూరు నియోజకవర్గంలో 29166 మంది విద్యార్థులకు విద్యా కిట్లు పంపిణీ చేశారని పేర్కొన్నారు. ఈ పాఠశాలలో పదికి పది పాయింట్లు సాధించిన నలుగురు విద్యార్థులకు నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 20 వేల రూపాయల వంతున నగదు ప్రోత్సాహాన్ని అందించామని ఆయన తెలిపారు. జిల్లా వ్యవసాయ సలహామండలి ఛైర్మెన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, జొన్నవాడ దేవస్థాన మాజీఛైర్మెన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, తహశీల్దార్ సుబ్బయ్య, మండల ప్రత్యేకాధికారి శ్రీహరిరెడ్డి, ఎంపిడిఓ శ్రీహరి, సర్పంచ్ విజయమ్మ, ఉప సర్పంచ్ మైనుద్దీన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



# పిఎంజిఎస్‌వై పథకంతో గ్రామాలకు మహర్దశ

**- కలెక్టర్ చక్రధర్‌బాబు**

కేంద్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన (పిఎంజిఎస్‌వై) పథకంతో గ్రామాలకు మహర్దశ కలిగిందని, దీంతో జిల్లాలోని అనేక గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల వసతులు మెరుగయ్యాయని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు అన్నారు. ఈనెల 18న నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో జిల్లా గ్రామీణ రహదారుల సదస్సును ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకం ఎంతో బృహత్తరమైనదన్నారు. రహదారుల సౌకర్యం లేక గ్రామీణ ప్రాంతాల ప్రజలు పడుతున్న బాధలను గుర్తించి కేంద్రం ఈ పథకంతో రోడ్ల వసతులను కల్పిస్తోందన్నారు. జిల్లాలో 820 కిలోమీటర్ల దాకా ఈ పథకం ద్వారా గ్రామీణప్రాంతాల్లో రోడ్లు వేయడం జరిగిందన్నారు. ఇంకా రోడ్లు లేని మారుమూల ప్రాంతాలను గుర్తించి రోడ్లు వేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్‌చక్రవర్తి మాట్లాడుతూ పిఎంజిఎస్‌వై పథకం గ్రామీణ ప్రాంతాలకు వరం లాంటిదన్నారు. జిల్లాలోని పట్టణాలను, గ్రామాలను కలిపేలా ఈ పథకం కింద మరింత విస్తృతంగా రోడ్లు వేయాలన్నారు. జేసీ గణేష్‌కుమార్, జడ్పీ సిఇఓ సుశీల, డిపిఓ ధనలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

## రోడ్ల నిర్మాణంలో ఇంకా వెనుకబడే ఉన్నాం - ఎమ్మెల్యే ఆనం

ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీమంత్రి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో గ్రామీణ రోడ్ల నిర్మాణంలో మనం వెనుకబడే ఉన్నామని, కేంద్రం నుంచి ఈ పథకానికి వస్తున్న నిధులను ఖర్చుచేసి మరింతగా రోడ్ల సౌకర్యాలు కల్పించాలని సూచించారు. మన జిల్లాకు నిధుల కేటాయింపులో తగ్గుదల కనిపిస్తోందని, జిల్లా వాటా మేరకు పూర్తి స్థాయిలో నిధులు రాబట్టుకొనేలా కార్యాచరణ జరగాలన్నారు. గత రెండేళ్ళుగా మన జిల్లా నుంచి ఈ పథకం కింద ఒక్క ప్రతిపాదన కూడా పంపిన దాఖలాలు లేవని, అటవీశాఖ అడ్డంకులతో జిల్లాలో 42 రహదారుల నిర్మాణాలు ఇంకా అసంపూర్తిగానే ఉన్నాయని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ ఈ విషయాలను పరిశీలించాలన్నారు. తొలిదశలో ఈ పథకం కింద పనులు బాగా జరిగినా, రెండు, మూడు దశల్లో పనుల ప్రతిపాదనలు లేవని, రహదారుల నిర్వహణ అంతా లోపభూయిష్టంగానే ఉందని, ఇకనైనా జిల్లా యంత్రాంగం గ్రామీణ రోడ్ల నిర్మాణంపై శ్రద్ధ చూపాలని కోరారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి పంచాయతీరాజ్ వ్యవస్థను వికేంద్రీకరణ చేసి గ్రామ సచివాలయ వ్యవస్థని ప్రారంభించి ప్రజలకు మెరుగైన సదుపాయాలు అందిస్తున్నారని ఆయన కొనియాడారు.

# కార్పొరేషన్‌లో కలకలం

## ఏసిబి తనిఖీలతో బెంబేలు



నెల్లూరు నగర కార్పొరేషన్‌లో ఏసిబి అధికారులు తనిఖీలకు రావడంతో కలకలం చెలరేగింది. ఈనెల 18వ తేదిన ఏసిబి అధికారులు హఠాత్తుగా కార్పొరేషన్ కార్యాలయంలోని రెవెన్యూ, సిటీ ప్లానింగ్ విభాగాల్లో ఆకస్మిక తనిఖీలు చేయడంతో సిబ్బంది హడలిపోయారు. ఈ తనిఖీల్లో భాగంగా ఏసిబి అధికారులు పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నారు.

ఏసిబి డిఎస్పీ జిఆర్ఆర్ మోహన్ ఈ తనిఖీల్లో భాగంగా డెప్యూటి కమిషనర్ చాంబర్లో రికార్డులను పరిశీలించారు. సంబంధిత అధికారులపై ప్రశ్నలు సంధించారు. కంప్యూటర్లలో ఉన్న సమాచారాన్ని కూడా పరిశీలించారు. తమకు అందిన ఫిర్యాదుల మేరకు సిటీ ప్లానింగ్, రెవెన్యూ విభాగాలపై తనిఖీలు చేస్తున్నామని, ఎక్కడైనా అవినీతి అక్రమాలు జరిగాయో లేదో నిశితంగా పరిశీలిస్తున్నామని ఏసిబి అధికారులు చెప్పారు.

# అదాని గ్రూప్‌తో ఎన్‌బికెఆర్ ఒప్పందం



కోట మండలం విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలతో కృష్ణపట్నం పోర్టుకు చెందిన అదాని గ్రూప్ అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి తెలిపారు. ఈనెల 18న అదాని స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ధనిష్‌ఖురేషి తమ కళాశాలకు వచ్చి వివిధ ఫ్యాకల్టీలను సందర్శించారని పేర్కొన్నారు. బిటెక్ చదువుకుంటున్న విద్యార్థులకు ఇంటర్న్‌షిప్, నైపుణ్యం, ఉపాధి అవకాశాల కోసం తగు శిక్షణ అందిస్తామని ఈ సందర్భంగా ఖురేషి చెప్పారు. తమ కళాశాల ఇప్పటిదాకా 15 బహుళజాతి కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుందని, అదాని గ్రూప్‌తో ఒప్పందం చేసుకోవడం తమ అదృష్టంగా భావిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధి ప్రవీణ్, ప్రాంగణ ఎంపికల అధికారి డాక్టర్ ఎన్ కిషాంధర్, డాక్టర్ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎంఫసిస్‌కు 64 మంది విద్యార్థులు

ఎన్‌బికెఆర్‌లో ప్రస్తుతం మూడవ సంవత్సరం బి.టెక్ చదువుతోన్న 64మంది విద్యార్థులు ఎంఫసిస్ బహుళజాతి కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఆగస్టు 13, 14 తేదీల్లో ఆన్‌లైన్‌లో నిర్వహించిన ప్రాంగణం ఎంపికల్లో ఆ విద్యార్థులు ఎంపిక కావడం సంతోషదాయకమని డాక్టర్ విజయకుమార్‌రెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి అభినందించినట్లు ఆయన తెలిపారు.

# పాఠశాలలను విలీనం చేయొద్దు

**విఠపు బాలసుబ్రహ్మణ్యం డిమాండ్**



జాతీయ నూతన విద్యావిధానంలో భాగంగా 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసే నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని శాసనమండలి సభ్యుడు, ప్రొటెం ఛైర్మెన్ విఠపు బాలసుబ్రహ్మణ్యం కోరారు. ఈనెల 18న ఆయన ఉదయగిరి రూరల్ మండలంలోని అప్పసముద్రం గ్రామంలో నాడు-నేడు పనులు పూర్తయిన ప్రాథమిక పాఠశాలను పరిశీలించి, నూతన విద్యావిధానంపై తల్లిదండ్రుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు మంద్ల నాగేశ్వరరావు తన తల్లి జ్ఞాపకార్థం ఆరు లక్షల రూపాయలతో నిర్మించిన భోజనశాలను ఆయన ప్రారంభించారు. ఎంఇఓ మస్తాన్‌వలీ, మాజీ ఎంపిపి చేజర్ల సుబ్బారెడ్డి, సర్పంచ్ నాగరత్నమ్మ, యుటిఎఫ్ నాయకులు కంబాల చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపతయ్య పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు శివకుమారి



'ప్లాస్టిక్-భావితరం' అనే అంశంపై ఇటీవల ఆన్‌లైన్‌లో జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో వెంకటాచలం మండలంలోని చెముడుగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బి.శివకుమారి విజయం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెడ్మాస్టర్ ఎం.అరుణ తెలిపారు.

## జొన్నవాడ కామాక్షితాయికి లక్ష కుంకుమార్చన



జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన జొన్నవాడలో కొలువై ఉన్న శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి దేవస్థానంలో ఈనెల 18న అమ్మవారికి లక్ష కుంకుమార్చన పూజలు ఎంతో వైభవంగా జరిగాయి. 20 మంది అర్చకులు పాల్గొని శ్రీ లలితా సహస్రనామార్చనతో పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

## సిపిఎస్ రద్దు చేయాలి

సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలంటూ నెల్లూరులో ఈనెల 18న వైద్య ఉద్యోగులు ఆందోళన చేశారు. నగరంలోని ప్రభుత్వ వైద్యకళాశాల వద్ద భోజన విరామ సమయంలో నిరసన చేపట్టారు. ధనరాజ్, షమీమ్ ఆధ్వర్యంలో ఈ ఆందోళన జరిగింది.

## రైతులకు డిసిసిబి స్వల్పకాలిక రుణాలు

జిల్లాలో దాదాపు 560 కోట్ల రూపాయలను రైతులకు స్వల్పకాలిక రుణాలుగా అందించేందుకు నిర్ణయించామని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సిఇఓ శంకర్‌బాబు తెలిపారు. ఈనెల 18న ఆయన పొదలకూరులోని సొసైటీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రైతులకు 285 కోట్ల రూపాయలను రుణాలుగా అందించామన్నారు. బంగారు రుణాలపై ఏడుశాతం వడ్డీతో మరో నూరు కోట్ల దాకా రుణాలు ఇచ్చేందుకు కూడా బ్యాంకు నిర్ణయించిందన్నారు. బ్యాంకు ఏజిఎం మధుసూదన్‌రావు, సొసైటీ ఇన్‌చార్జి సిఇఓ సందానిబాషా పాల్గొన్నారు.

## ‘ప్రభా’తం

అరాచక ఉగ్రవాద హింసోన్మాదం ఎలా ఉంటుందో ఆఫ్ఘనిస్థాన్ ఇప్పుడు నేరుగా చూస్తోంది. ఎటుచూసినా తాలిబన్ల దాడులతో ఆఫ్ఘనిస్థాన్ గత కొద్దిరోజులుగా అల్లకల్లోలంగా ఉంది. ఎవరు ఎప్పుడు వస్తారో.. ఏం చేస్తారో.. ఒకటే భయం!.. ఎప్పుడో మధ్యయుగాల నాటి అనాగరిక కర్కశ విధానాలను అమలుచేయడంలో ఆరితేరిన తాలిబన్లు ఆఫ్ఘాన్‌ను మళ్ళీ ఇప్పుడు వశపరుచుకోవడంతో ఆఫ్ఘాన్ నేల..బేలగా మిగిలిపోయింది. అధ్యక్షుడుగా ఉండి మొన్నటిదాకా ఉత్తరకుమారుడిలా ప్రగల్భాలు పలికిన ఘనీ ఆఖరిక్షణంలో ఆ ముష్కరుల ధాటికి హడలిపోయి పలాయనం చిత్తగించడంతో ఆఫ్ఘాన్ నిస్సహాయంగా నిలచిపోయింది. అడుగడుగునా గన్‌లు చేపట్టిన తాలిబన్‌లు ఆఫ్ఘాన్‌ను దురాక్రమించేసుకుని ప్రజల్ని భయకంపితం చేస్తుండడంతో అసహాయులైన ప్రజలంతా ప్రాణభయంతో వణికిపోయారు. ముఖ్యంగా మహిళల పరిస్థితి మరీ దారుణంగా.. అత్యంత దయనీయంగా ఉంది. లైంగిక దాడుల భయంతో బాలికలు, యువతులు అనుక్షణం బెంబేలెత్తిపోతున్నారు. ఎట్లయినా సరే అక్కడ నుంచి ప్రాణాలతో బతికి బట్టకడితే చాలనుకుంటూ ఉన్న ఊళ్లను, ఆస్తిపాస్తుల్ని అన్నిట్నీ వదిలిపారేసి కట్టుబట్టలతో ప్రాణాలు కాపాడుకునేందుకు ఇంకెక్కడికైనా వెళ్ళిపోదామని పిల్లాజెల్లాతో సహా విమానాశ్రయాల వైపు పరుగులు పెట్టడంతో.. చివరికి విమానమెక్కి ప్రమాదవశాత్తూ జారిపోయిన వారు.. ఎగురుతున్న విమానం నుంచి కిందపడి మృతిచెందిన అభాగ్యులు కూడా ఉన్నారు. గత రెండు మూడు రోజులుగా ఎంత ఘోరమైన దృశ్యాలో!...అందరినీ కంటతడి పెట్టించిన ఘటనలవి. ముష్కరమూకల నుంచి తమను తాము ఎలా కాపాడుకోవాలో.. ఎక్కడ దాక్కోవాలో తెలియక ప్రాణాలు అరచేత పట్టుకుని పరుగులు తీస్తున్న ప్రజలను చూస్తే ఎవరికైనా హృదయం ద్రవించకమానదు.

# ఆఫ్ఘాన్..అల్లకల్లోలం

అగ్రరాజ్యమైన అమెరికా ఆఫ్ఘనిస్తాన్ నుంచి తన సేనలను ఉపసంహరించుకోవడం, ఆఫ్ఘాన్ ప్రభుత్వం దేశ రక్షణకు ధీటైన చర్యలు తీసుకోలేకపోవడం, ఆఫ్ఘాన్ సైనికులు పూర్తిస్థాయిలో చేతులెత్తేయడం... కారణాలేమైతేనేం.. ఆఫ్ఘనిస్తాన్ ఇప్పుడు ఉగ్రమూకల చేతుల్లోకి వెళ్లిపోయింది. ప్రజాస్వామ్యం కూలిపోయి అంతా తాలిబన్ల రాజ్యమైపోయింది. ఒక్కమాటలో చెప్పాలంటే.. ఆఫ్ఘనిస్తాన్.. ఇప్పుడు ‘తాలిబనిస్థాన్’గా మారిపోయింది. ఆఫ్ఘనిస్తాన్‌ను సురక్షితంగా ఉంచుతామని, మహిళల హక్కులను గౌరవిస్తామని చెప్పుకుంటున్న తాలిబన్ల తాజా మాటలపై ప్రజలకు విశ్వాసం కలగడం లేదు. ఏదేమైనా.. చివరికి ఆఫ్ఘాన్ భవిత్యం ఏమిటో కాలమే నిర్ణయించాలి.

ఆఫ్ఘనిస్తాన్ నుంచి అగ్రరాజ్యమైన అమెరికా తన సేనలను ఉపసంహరించుకోవడం, ఆఫ్ఘాన్ ప్రభుత్వం అందుకు తగ్గట్టుగా దేశ రక్షణకు ధీటైన చర్యలు తీసుకోలేకపోవడం, ఆఫ్ఘాన్ సైనికులు దేశాన్ని రక్షించుకోవాల్సిన అత్యవసరమైన దశలో పూర్తిస్థాయిలో చతికిలపడి చేతులెత్తేయడం... కారణాలేమైతేనేం.. ఆఫ్ఘనిస్తాన్ ఇప్పుడు తాలిబన్‌ల చేతుల్లోకి వెళ్ళిపోయింది. ప్రజాస్వామ్యం కాస్తా కూలిపోయి అంతా తాలిబన్ల రాజ్యమైపోయింది. ఒక్కమాటలో చెప్పాలంటే.. ఆఫ్ఘనిస్తాన్.. ఇప్పుడు ‘తాలిబనిస్థాన్’గా మారిపోయింది.

సుమారు ఇరవై ఏళ్ళ క్రితం ఉగ్రవాదంపై పోరులో భాగంగా ఆఫ్ఘాన్‌లో అడుగుపెట్టిన అమెరికా సేనలు తాలిబన్లను గద్దెదించి ప్రజాస్వామిక ప్రభుత్వానికి మద్దతునివ్వడం తెలిసిందే. అలా ఎన్నాళ్ళు ఎన్నేళ్ళు ఉండాలని అంటూ తమ సేనలు ఆఫ్ఘాన్ నుంచి వైదొలగాలని అమెరికా నిర్ణయించడంతో ఆఫ్ఘాన్ దిక్కుతోచని స్థితిలో పడింది. ప్రజల రోదన అరణ్యరోదనే అయింది. తమకు రక్షణగా ఉన్న అమెరికా సేనలు వైదొలగుతున్నట్లు ప్రకటించగానే ఆఫ్ఘాన్ సైనిక దళాలు ఒక్కసారిగా అయోమయంలో పడ్డాయి. తాలిబన్లు ఇదే అదనుగా బిలబిలమంటూ రంగంలోకి దిగేశారు. మెరుపు వేగంతో ఆఫ్ఘాన్‌లోని అన్ని ప్రాంతాలను, నగరాలను సైతం భీకరమైన దాడులతో అదరగొడుతూ శరవేగంగా ఆఫ్ఘాన్‌ను ఆక్రమించుకున్నారు. అమెరికా తీసుకున్న తొందరపాటు నిర్ణయం వల్లే ఇదంతా జరిగిందంటూ అంతర్జాతీయస్థాయిలో అమెరికాపై విమర్శలు వచ్చినా అమెరికా తన నిర్ణయాన్ని మాత్రం సమర్థించుకుంది. ఆఫ్ఘాన్ నిర్మాణం కోసం లక్షల కోట్ల మొత్తంలో ఖర్చుచేశామని, ఆ దేశ భవిష్యత్తుకోసం ఎంత చేసినా సైనికులు పోరాడకుండానే కుప్పకూలిపోయారని, ఈ దుస్థితికి ఆఫ్ఘాన్ ప్రభుత్వానిదే బాధ్యత అంటూ అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ విమర్శిస్తూ అమెరికా నిర్ణయం సరైనదేనని సమర్థించుకున్నారు. దీంతో చివరికి.. ఆఫ్ఘాన్ భవితవ్యం ఏమిటన్నది ప్రశ్నార్థకమైంది. ఈ నేపథ్యంలో దేశప్రజలందరికీ క్షమాభిక్ష ప్రసాదించామని ప్రకటించి తాలిబన్లు ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమవుతున్నారు. పాక్, చైనాల ప్రత్యక్ష పరోక్ష మద్దతు ఉన్న తాలిబన్లు పూర్తిస్థాయిలో ప్రభుత్వం ఏర్పాటు చేశాక కానీ పాలనా పరంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారో ఎవరికీ తెలియదు. అయితే, ఆఫ్ఘనిస్తాన్‌ను సురక్షితంగా ఉంచుతామని, స్థానికులపై ఎలాంటి ప్రతీకారాలు తీర్చుకునేది ఉండదని, మహిళల హక్కులను గౌరవిస్తామని, మహిళలు ప్రభుత్వంలో భాగస్వాములు కావాలని తాజాగా తాలిబన్లు కోరడం సంచలనం కలిగించే విషయమే. అంతేకాదు, ఇతర దేశాలతో తాము శాంతియుత సంబంధాలనే కోరుకుంటున్నామని, అంతర్గతంగా, బహిర్గతంగా ఎలాంటి శత్రువులను కోరుకోవడం లేదని, ఆఫ్ఘాన్ నుంచి ఏ దేశానికి ముప్పు ఉండదని వాగ్దానం చేస్తున్నామని తాలిబన్ నేతలు ప్రకటించడం, తాలిబన్లు తమ సహజ వైఖరికి భిన్నంగా అందరినీ కలుపుకునిపోయే విధంగా మాట్లాడుతుండడం, ప్రభుత్వంలో ఇతర రాజకీయపార్టీల నాయకులను కూడా చేర్చుకోవాలనే దిశగా చర్చలు చేస్తుండడం అందరూ ఆశ్చర్యపోయేదే!.. అయితే, తాలిబన్ల మాటలపై ఆ దేశప్రజల్లో ఎవరికీ నమ్మకం కుదరడం లేదు. తాము మారిపోయామని చెప్పడానికి తాలిబన్లు ప్రయత్నిస్తున్నట్లుంది.. కానీ ప్రజలు మాత్రం తాలిబన్ల పేరు వింటేనే హడలిపోతున్నారు. తాలిబన్లు త్వరలోనే తమ నిజస్వరూపాన్ని బయటపెట్టి ఒకప్పటి అరాచక పాలనను మళ్ళీ తీసుకొస్తారనే భయాందోళనలు ప్రజల్లో సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. విదేశాల నుంచి ఆఫ్ఘాన్‌కు నిధులు నిలిచిపోకుండా ఉండేందుకు ముష్కరులు అలా నటిస్తుండవచ్చని కూడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అందుకే తాలిబన్లు అలా శాంతిమంత్రాలు వల్లెవేస్తున్నారనే అభిప్రాయాలు వెల్లడవుతున్నాయి. ఏదేమైనా ఈ గాయాలు ఎప్పటికి మానుతాయో..అల్లకల్లోలంగా ఉన్న ఆఫ్ఘాన్ భవిత్యం ఏమిటో కాలమే నిర్ణయించాలి.

---

### ఎట్టకేలకు ఎంటియు 1010

## ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం అంగీకారం

○ రైతుల్లో వెల్లివిరుస్తున్న ఆనందం

జిల్లాలో ఈ ఖరీఫ్ ఎడగారు సీజన్‌లో రైతులు పండించిన 1010 రకం ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించడంతో రైతాంగంలో సంతోషం వ్యక్తమవుతోంది. ఈ సీజన్‌లో జిల్లావ్యాప్తంగా 1,06,362 ఎకరాల్లో వరి సాగైంది. అందులో దాదాపు 39వేల ఎకరాల్లో 1010 రకం ధాన్యాన్ని, మరో 67వేల ఎకరాల్లో ఎన్ఎల్ఆర్ 34449 రకం ధాన్యాన్ని రైతులు పండించారు. అనేకప్రాంతాల్లో వరికోతలు జరుగుతున్నాయి కూడా. ఈసారి ఎంటియు 1010 రకం ధాన్యం మాత్రమే సుమారు లక్ష మెట్రిక్ టన్నుల దిగుబడి అవుతుందని అంచనా. అయితే ఈ రకం ధాన్యం గింజలు కాస్త లావుగా ఉండడంతో ప్రభుత్వం వాటిని కొనుగోలు చేసేందుకు తొలుత ముందుకు రాలేదు. దీంతో రైతులు నష్టపోతున్నారని తెలుసుకుని ప్రభుత్వం ఉన్నతాధికారులను సంప్రదించి వాటిని కూడా కొనుగోలు చేయాలని ఆదేశించింది. దీంతో ఎంటియు 1010 రకం ధాన్యాన్ని పోర్టిఫైడ్ బియ్యంగా మార్చేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారానే ఈ ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని నిర్ణయించి, జిల్లాలోని 14 రైసుమిల్లుల ద్వారా ఆ ఏర్పాట్లు ముమ్మరం చేసింది. ఎట్టకేలకు 1010 రకం ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ముందుకురావడంతో రైతులు ఆనందిస్తున్నారు.

## జర్నలిస్టుల సమస్యలు తీర్చాలి




అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు మంజూరు చేయాలని, కరోనాతో చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు 3 లక్షల ఆర్థిక సహాయాన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో నెల్లూరు కలెక్టరేట్ వద్ద ఈనెల17న ఆందోళన నిర్వహించారు. తొలుత నెల్లూరు ప్రెస్‌క్లబ్ నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు జర్నలిస్టులు ప్రదర్శనగా వెళ్లారు. జర్నలిస్టులందరికీ ఆరోగ్య బీమా వర్తింపజేయాలని, గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్, జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, దయశంకర్, హనోక్, రామ్మూర్తి పాల్గొన్నారు.

### కావలి పోలీస్‌స్టేషన్‌కు..

## కరోనా కాటు

### సిఐ, ఎస్ఐతో సహా అందరికీ కోవిడ్

జిల్లాలో కరోనా వీరంగం సృష్టిస్తోంది. కావలి రూరల్ పోలీస్‌స్టేషన్ కరోనా దెబ్బకు విలవిలలాడుతోంది. ఈ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న సిఐ, ఎస్ఐతో సహ తొమ్మిది మంది పోలీసులు కోవిడ్ పాజిటివ్ రావడంతో పోలీసువర్గాలు కంగుతిన్నాయి. సిఐ అక్కేశ్వరరావు, ఎస్ఐ ప్రతాప్ యాదవ్, ఏఎస్ఐ బాషాతో పాటు ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు, ఐడి పార్టీ సిబ్బంది, రిసెప్షనిస్టు మొత్తం తొమ్మిది మందిపై కరోనా తన ప్రతాపం చూపుతోంది. దీంతో అందరూ అనారోగ్యం పాలయ్యారు. పోలీస్‌స్టేషన్‌కు ఎవరూ రావడం లేదు. అందరూ ఇళ్ళలో ఉండి కోవిడ్ చికిత్సలు చేయించుకుంటున్నారు. కరోనాతో ఒక పోలీస్‌స్టేషన్ అధికారులు, సిబ్బంది అందరికీ ఒకేసారి కోవిడ్ పాజిటివ్ రావడం జిల్లాలో సంచలనం కలిగిస్తోంది. పోలీసులంతా సత్వర చికిత్సలతో సురక్షితంగా ఉండాలని అందరూ కోరుకుంటున్నారు.

## రేషన్ పంపిణీ

పిఎంజికెఏవై పథకం కింద ఉచిత రేషన్ బియ్యాన్ని ఈనెల 18 నుంచి పంపిణీ చేస్తున్నారు. ఆగస్టు నెలకు సంబంధించి ఈ బియ్యాన్ని రేషన్‌కార్డులోని ఒక్కో సభ్యుడికి 5కిలోల వంతున ఇస్తారు. జిల్లాలోని మొత్తం 8,95,508 మంది కార్డు దారులకు ఈ బియ్యం పంపిణీ చేస్తున్నారు.

## ప్రమాదకరంగా మారిన ‘మ్యాన్‌హోల్స్’

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

నెల్లూరు నగరంలో అనేక ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు పరమ అధ్వాన్నస్థితిలో ఉన్నాయి. రోడ్ల మీద ఉన్న మ్యాన్‌హోల్స్ కూడా ప్రమాదకరంగా మారుతున్నాయి. ముఖ్యమైన ప్రాంతాల్లో కూడా రోడ్లమీద గ్రావెల్ లేచిపోయి గుంటలు మిట్టలుగా ఉన్నాయి. వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉన్నా, పాదచారులు ఆ రోడ్ల మీద నడవలేక అవస్థలు పడుతున్నా పాలకులు కానీ, కార్పొరేషన్ అధికారులు కానీ పట్టించుకోవడం లేదు. ఎప్పటికప్పుడు రోడ్లు బాగుచేస్తున్నామంటున్నారే కానీ చేసిందేమీ లేదన్నది లోకవిదితం. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం నెల్లూరు నగరానికి ఎంతోకాలంగా ఒక శాపంగా ఉంది. ఈ పరిస్థితి అందరికీ తెలిసిందే అయినా అది బాగయ్యేదెప్పుడో!.. కంపుగొట్టే కాలువలతో, ఇళ్ళ పక్కలంతా మురుగుతో పొంగిపోతున్న సైడుకాలువలతో నెల్లూరు నగరం పరమ దౌర్భాగ్యంగా ఉన్నా పట్టించుకునే నాథులే లేరు. నెల్లూరు నగరాన్ని సుందర నందనవనం చేస్తామని ఆర్భాటపు ప్రకటనలే తప్ప ఆచరణలో జరుగుతున్న అభివృద్ధి నామమాత్రంగానే ఉంటోంది. ఏ వీధి చూసినా చెత్తకుప్పలతో, మురుగుదిబ్బలతో గబ్బు కొట్టిపోతోంది. నగరంలోని శ్రీనివాస అగ్రహారం, రామ్మూర్తినగర్ తదితర ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్‌పై ఉన్న మూతలు తుప్పుపట్టిపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళనతో ఉన్నారు. ఇకనైనా కార్పొరేషన్ అధికారులు, జిల్లాస్థాయి ఉన్నతాధికారులు, రోడ్లు భవనాలశాఖ అధికారులు అందరూ కలసి ఒక్కసారైనా పర్యటించి పరిస్థితులను సమీక్షిస్తే బాగుంటుందని, నిపుణులతో కలసి రోడ్లను పరిశీలించి వాటి బాగుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రార్థన.

*శ్రీవాణీ మల్లీశ్వరి*, నెల్లూరు.

## కొళాయిలు ఊడిపోతున్నాయి

నెల్లూరు, వైయస్ఆర్ నగర్ వాసులకు నీటి కొరత లేకుండా చేసేందుకు వీధి వీధికి కొళాయిలు ఏర్పాటు చేశారు. ఇక నీటి కష్టాలు తీరాయి అని సంతోషపడేలోపే నాసిరకం పనుల వల్ల చాలాచోట్ల పైపులకు బిగించిన కొళాయిలు ఊడిపోయాయి. దీంతో నీరు వృధాగా పోతోంది. దీనికి తోడు మినరల్ వాటర్ కోసమంటూ ఆ పైప్‌లైన్ పక్కనే గుంతలు తవ్వేయడంతో ఆ నీరంతా వచ్చి గుంతల్లో చేరుతున్నాయి. ఆ దెబ్బకు వీధులంతా దోమలు పెరిగిపోతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు ఓసారి అభివృద్ధి పనులు జరిగాక వాటి అమలు ఎలా ఉంటుందో ప్రత్యక్షంగా చూడాలి.

*జె. యస్. కృష్ణ*, నెల్లూరు.

# జగన్‌ని కలిసిన ప్రవీణ్



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని నెల్లూరుజిల్లా యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు చిట్టమూరు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి కలిశారు. ఆగష్టు 17వ తేదీ మంగళవారం కరెంటు మంత్రి బాలినేని శ్రీనివాస్‌రెడ్డితో కలిసి తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో జగన్‌ని ప్రవీణ్ కలుసుకున్నారు. దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డితో ప్రవీణ్‌కి వున్న అనుబంధం, యూత్‌కాంగ్రెస్ అధ్యక్షులుగా వాసు, ప్రవీణ్ కలిసి పనిచేసిన సమయం, గీతాంజలి సినిమా సహ నిర్మాతగా సినిమారంగంలో ప్రవీణ్‌కి ఉన్న సంబంధాల గురించి వీరిమధ్య చర్చకు వచ్చినట్లు సమాచారం. ప్రవీణ్‌ని ముఖ్యమంత్రితో కలిపించి తమ సుదీర్ఘ స్నేహబంధాన్ని చూపించడంతో పాటు మిత్ర ధర్మాన్ని నిర్వర్తించారు మంత్రి బాలినేని. శుభం ...!

## తిరుపతి పార్లమెంటు లీగల్‌సెల్ అధ్యక్షుడిగా

# మునిబాలసుబ్రహ్మణ్యం (దొరబాబు)



ఆయన పుట్టింది చిత్తూరుజిల్లా. న్యాయశాస్త్రంలో పట్టా పొందింది నెల్లూరులో. అందరికీ దొరబాబుగా సుపరిచితుడైన ఈయన అసలు పేరు మునిబాల సుబ్రహ్మణ్యం. 1995లో న్యాయశాస్త్ర పట్టభద్రుడైన వెనువెంటనే న్యాయవాదిగా ప్రాక్టీస్ మొదలుపెట్టి నైపుణ్యత కలిగిన అద్వకేట్‌గా పేరు సంపాదించుకున్నారు. తెలుగుదేశం పాలన సమయంలో అనేక ప్రజాసంబంధిత అంశాలలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా కేసులు వేసి వాదించేవారు దొరబాబు. ఎన్నికల సమయంలో టిడిపి, బిజెపి పార్టీల అరాచకాలను పలు సందర్భాలలో ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్లి అడ్డుకున్న చరిత్రకూడా దొరబాబుకి ఉంది. జిల్లాలోని పార్టీ శ్రేణులందరితోను సత్సంబంధాలు కలిగి పార్టీకి ఎక్కడ ఎలాంటి న్యాయసలహాలు అవసరమైనా ఆయన ముందుండేవారు. మొత్తం 25 పార్లమెంటు నియోజకవర్గాల లీగల్‌సెల్ అధ్యక్షుల నియామకాలలో భాగంగా నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గానికి వై.మురళీధర్‌రెడ్డిని నియమించగా,





తిరుపతి పార్లమెంటు నియోజకవర్గానికి దొరబాబుని రాష్ట్ర లీగల్‌సెల్ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి నియమించారు. పార్టీ న్యాయ విభాగంలో పనిచేసే అవకాశం తనకు కల్పించినందుకు రాష్ట్ర నాయకత్వంతోపాటు జిల్లా నాయకులకు కూడా దొరబాబు తన కృతజ్ఞతలు తెలుపుకున్నారు. తిరుపతి పార్లమెంటరీ పార్టీ నూతన న్యాయసారధిగా అటు తాను పుట్టినూరికి, ఇటు తనకు న్యాయపట్టా ఇచ్చినూరికి సేవలందించే అవకాశాన్ని అందుకున్న దొరబాబుకి 'లాయర్' అభినందనలు.

# అద్భుతమైన కవి 'నాగభైరవ' - కె.శివారెడ్డి

నాగభైరవ కోటేశ్వరరావు అద్భుతమైన కవి, తనకు సమకాలికుడు అని కేంద్ర సాహిత్య అకాడమీ కన్వీనర్ కె.శివారెడ్డి నాగభైరవను కీర్తించారు. ఎంతోమంది యువ కవులను ఆయన ప్రోత్సహించారని చెప్పారు. యువకవుల పరిచయాన్ని పత్రికల్లో వ్యాసాలుగా వెలువరించారని పేర్కొన్నారు. ఈ నెల 14న జరిగిన 'జూమ్' మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ నాగభైరవ విమర్శనాత్మక గ్రంథాల్లో ప్రథమ బహుమతి పొందిన రచయిత గుడిపాటిని అభినందిస్తూ తన కవిత్వ ప్రయాణంలో గుడిపాటి అందించిన తోడ్పాటు మరువలేనిదని చెప్తూ గుడిపాటి సాహితీ ఎగుడుదిగుళ్ళను ఆయన ప్రస్తావించారు.

కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత నిఖిలేశ్వర్ గుడిపాటి సాహితీ ప్రస్థానాన్ని ప్రస్తావిస్తూ ఇంద్రవెల్లి సభలను గురించి, తెలంగాణ ఉద్ధండుల గురించి తనదైన రీతిలో సమీక్షించిన చక్కటి విమర్శకుడు, ప్రాసంగికిత కల్గిన జర్నలిస్టుగా గుడిపాటిని అభివర్ణించారు.

ఏ రక్త సంబంధం లేకపోయినా చిన్ని నారాయణరావు తమ సోదరుడు నాగభైరవ కోటేశ్వరరావు అవార్డును నెలకొల్పి పది సంవత్సరాలుగా సాహితీసేవ చేయడం అభినందనీయంగా పేర్కొన్నారు. ఆయనకు తాము ఆత్మీయ పురస్కారం అందించబోతున్నట్లు చెప్పారు.

కీ॥శే॥ డా॥ నాగభైరవ కోటేశ్వరరావు ఎంతో ఉన్నతమైన కవి, సమున్నతమైన వ్యక్తి అని డా॥ బీరం సుందరరావు కొనియాడారు. డా॥ నాగభైరవ అవార్డు కోసం ఎంతోమంది తనను సంప్రదించినట్లు పేర్కొన్నారు. అవార్డునిచ్చే వ్యక్తులను బట్టి అవార్డు విలువ నిర్ణయింపబడుతుందని చిన్ని నారాయణరావు, వెన్నెలకంటిలు కలిసి నాగభైరవ అవార్డుకే గొప్ప విలువ సాధించి పెట్టారని చెప్పారు ప్రముఖకవి, అనువాదకుడు శ్రీనివాస్‌గౌడ్.

ఈ అవార్డు సభలో పాలుపంచుకోవడం తనకు చాలా ఆనందదాయకమని కవి విల్సన్‌రావు పేర్కొన్నారు.



నాగభైరవ పదవ అవార్డు సభలో ఉత్తమ విమర్శ గ్రంథం 'పుట్ట బంగారం'కు అవార్డు అందజేస్తున్న కె.శివారెడ్డి, నిఖిలేశ్వర్, విల్సన్‌రావు

తన పుస్తకానికి నాగభైరవ అవార్డు రావడం చాలా సంతోషకరమని అవార్డు గ్రహీత పాలపిట్ట సాహితీ సంచిక సంపాదకులు గుడిపాటి చెప్పారు. ఉత్తమ విమర్శ గ్రంథాల ప్రత్యేక బహుమతులు అందుకొన్న డా॥ రెంటాల శ్రీ వెంకటేశ్వరరావు, డా॥ అమళ్ళదిన్నె వెంకటరమణప్రసాద్(అనంతపురం), కె.వి.రమణారెడ్డి(మార్గాపురం) పాల్గొని ప్రసంగించారు. ఈ జూమ్ సభకు సమన్వయకర్తగా 'మల్లెతీగ' సాహితీ పత్రిక సంపాదకులు కలిమిశ్రీ వ్యవహరించగా, డా॥ నాగభైరవ అవార్డు ప్రధాన కార్యదర్శి చిన్ని నారాయణరావు నిర్వహణలో జరిగిన ఈ సభలో నవ్యాంధ్ర రచయితల సంఘం అధ్యక్షులు బిక్కి కృష్ణ, కవులు బొగ్గరపు రాధాకృష్ణమూర్తి, ఏటూరు నాగేంద్రరావులు పాల్గొన్నారు.

గుడిపాటి 'పుట్ట బంగారం' ఉత్తమ విమర్శ గ్రంథానికి రూ.5,000/–లు నగదు, శాలువా, మెమెంటోతో సత్కరించారు. ప్రత్యేక బహుమతులుగా ముగ్గురుకి వెయ్యి రూపాయల నగదు, శాలువ, మెమెంటో ఇచ్చారు. 10వ నాగభైరవ అవార్డు సభ ఎంతో మంది ఆహుతుల మధ్య వైభవంగా జరిగింది.




## విద్యాదాత కెవి రత్నంకు..

# ఉప రాష్ట్రపతి కుటుంబసభ్యుల పరామర్శ

గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ప్రముఖ విద్యాసంస్థల అధినేత, విద్యాదాత కెవి రత్నంను ఈనెల 14న ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు కుటుంబ సభ్యులు పరామర్శించి ఆయన పట్ల తమకున్న ఆత్మీయతను చాటుకున్నారు. నెల్లూరు నగరంలోని హరనాథపురంలో ఉన్న ఆయన నివాసానికి వెళ్ళిన వెంకయ్యనాయుడు కుమార్తె, స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్, కుమారుడు హర్షవర్ధన్‌బాబు, మనుమడు విష్ణుబాబు ఆయన ఆరోగ్యం గురించి ప్రస్తావిస్తూ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రత్నం సతీమణి పద్మావతి, కుమారులు వేణుగోపాల్, కృష్ణకిశోర్ తదితరులంతా వారిని సాదరంగా ఆహ్వానించారు. రెండు కుటుంబాల వారు ఒకరినొకరు అభిమానంతో మాట్లాడుకున్నారు. అనంతరం కెవి రత్నం మాట్లాడుతూ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు కుటుంబసభ్యులు తనను పరామర్శించడం వారి సంస్కారానికి నిదర్శనమన్నారు. ఎంతోకాలంగా వెంకయ్యనాయుడన్నా, వారి కుటుంబమన్నా తమ కుటుంబానికి ఎంతో అభిమానమన్నారు. స్నేహపాత్రులైన వారి పలకరింపుతో తనకెంతో ఉత్సాహం, ఆనందం కలిగాయని, తనకు కొత్త శక్తి వచ్చినట్లయిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.







# వాహనదారులు హెల్మెట్ పెట్టుకోవాలి

**ట్రాఫిక్ డిఎస్పీ అబ్దుల్ సుభాన్**



వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకొని ప్రమాదాల నుండి బయటపడాలని నెల్లూరు ట్రాఫిక్ డిఎస్పీ అబ్దుల్ సుభాన్ సూచించారు. ఈ నెల 16వ తేదీన స్థానిక కె.వి.ఆర్ పెట్రోల్ బంక్ వద్ద హెల్మెట్ వినియోగంపై ఆయన సీఐ రాములునాయక్‌తో కలసి వాహనదారులకు అవగాహన కల్పించారు. డిఎస్పీ మాట్లాడుతూ దురదృష్టవశాత్తు ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు వాహనదారులు హెల్మెట్ పెట్టుకుని ఉంటే ప్రాణాలకు ప్రమాదం లేకుండా కాపాడుకోవచ్చన్నారు. ఈ నెల 17వ తేదీ నుంచి హెల్మెట్ లేకుంటే జరిమానా విధిస్తామన్నారు. ఆర్ఎస్ఐ కృష్ణ, ట్రాఫిక్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల అలసత్వం..
# ఉద్యోగులకు సంకటం

**- ఎన్జీఓ నేత బండి శ్రీనివాసరావు**



అధికారుల అలసత్వంతో ఉద్యోగులు నానా యాతనలు పడుతున్నారని, విధి నిర్వహణలో అనేక మంది ఉద్యోగులు కరోనా బారిన పడి మరణించినా, వారికి ప్రభుత్వం నుండి రావలసిన బెనిఫిట్స్ సకాలంలో అందకపోవడం దారుణమని ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు అన్నారు. నెల్లూరు నగరంలోని ఎన్జీవో హోంలో ఇటీవల జరిగిన మాజీ జిల్లా అధ్యక్షుడు శేఖర్‌రావు సంతాపసభలో ఆయన మాట్లాడుతూ ప్రాణాలు కోల్పోయిన ఉద్యోగుల అంత్యక్రియలు సరిగా చేసుకోలేక కుటుంబసభ్యులు అనేక బాధలు పడ్డారన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రధాన సమస్యగా ఉన్న సిపిఎస్ విధానాన్ని రద్దు చేస్తామని,అలాగే కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేస్తామని ఆగస్టు 15న ముఖ్యమంత్రి హామీ ఇవ్వడం హర్షదాయకమని అందుకు సీఎంకు తాము తాము ధన్యవాదాలు చెప్పున్నామన్నారు.

# మళ్ళీ.. నైపుణ్యాభివృద్ధి శిక్షణ

ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన పథకం ద్వారా నిరుద్యోగ యువతకు ఇచ్చే నైపుణ్య శిక్షణ పునఃప్రారంభిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి షేక్ అబ్దుల్ ఖయ్యూం తెలిపారు. కరోనా నేపథ్యంలో ఇటీవల దాకా నిలిపివేసి ఉన్న ఈ శిక్షణ మళ్ళీ ప్రారంభమవుతుందని, జిల్లా కలెక్టర్ అనుమతితో కోవిడ్ నిబంధనలు పాటిస్తూ శిక్షణా తరగతులు నిర్వహించనున్నామని ఆయనో ప్రకటనలో పేర్కొన్నారు.

# బాలుడి వైద్యానికి ప్రజా వాకర్స్ సాయం



నెల్లూరు జడ్పీ హైస్కూల్‌లో ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. నెల్లూరు జిల్లా ప్రజా వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం హృదయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న కార్తీక్ అనే బాబుకు 3500 రూపాయలు నగదు అందజేశారు. కరోనా నుంచి కోలుకున్న 7 మంది వాకర్స్‌కి ఆత్మీయ సత్కారం చేశారు. 1947 ఆగస్టు 15కు ముందు జన్మించిన పదిమందిని సన్మానించారు. ఈ సందర్భంగా ఇటీవల వాకర్స్ అసోసియేషన్‌లోని నలుగురు కుటుంబసభ్యుల పిల్లలకు జరిగిన వివాహాలను పురస్కరించుకుని, వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ 203 డిస్ట్రిక్ట్ గవర్నర్ రాఘవరెడ్డి, సెక్రటరీ నలుబోలు బలరామయ్యనాయుడు, ట్రెజరర్ సత్యనారాయణ, అధ్యక్షులు చలంచర్ల భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి మరియు 203 డిస్ట్రిక్ట్ డిప్యూటీ గవర్నర్ మెట్టు సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు





## కలెక్టరేట్‌లో..
# వందడుగుల జెండా స్తూపం

75వ స్వాతంత్ర్యదినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు ఆధ్వర్యంలో అందరికీ స్ఫూర్తిదాయకంగా పెద్ద ఎత్తున వేడుకలు నిర్వహించారు. నాటి స్వాతంత్ర్యోద్యమంలో ఎందరో మహనీయుల త్యాగాలను గుర్తుకుతెచ్చేవిధంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యుద్దీపకాంతులతో కలెక్టరేట్‌తో పాటు వివిధ ప్రభుత్వ కార్యాలయాలు దేదీప్యమానంగా వెలుగొందేలా ముస్తాబు చేశారు. ఈసారి స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలకు ప్రత్యేకంగా నెల్లూరు కలెక్టరేట్‌లో వందడుగుల స్తంభాన్ని ఏర్పాటుచేసి జాతీయపతాకం రెపరెపలాడుతూ ఉండేలా ఏర్పాట్లు చేసి అందరినీ ఆకట్టుకోవడం విశేషం.

# రంగనాధునికి పవిత్రోత్సవాలు ప్రారంభం



ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాథ స్వామి దేవాలయంలో ఈనెల 18 నుంచి ఎంతో వైభవంగా పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. అయిదురోజుల పాటు జరగనున్న ఈ వేడుకలను ఆలయ ఇఓ డి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు నిర్వహిస్తున్నారు. కోవిడ్ నేపథ్యంలో ఈ సేవలన్నీ స్వామివారికి ఏకాంతంగానే జరుగుతాయని ఆలయ వర్గాలు తెలిపాయి.

# యూజర్ ఛార్జీలు వసూలు చేయండి

**కమిషనర్ దినేష్‌కుమార్**



నెల్లూరు నగర కార్పొరేషన్ పరిధిలో యూజర్ ఛార్జీలను వసూలు చేయాలని నెల్లూరు నగర కమిషనర్ దినేష్‌కుమార్ పారిశుద్ధ్యం విభాగం అధికారులకు సూచించారు. కార్పొరేషన్ కార్యాలయంలో పారిశుద్ధ్య విభాగం అధికారులతో ఈ నెల 17న ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. కొత్త యూజర్ ఛార్జీల వసూలుపై ప్రభుత్వం సూచించిన విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, అదనపు కమిషనర్ ప్రసాద్, పారిశుద్ధ్య విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఏఆర్ ఏఎస్పీగా.. సుబ్రహ్మణ్యం

నెల్లూరు ఏఆర్ ఎస్పీగా విశాఖపట్నం హెడ్‌క్వార్టర్స్‌లో అడిషనల్ డిసిపిగా పనిచేస్తున్న కె. సుబ్రహ్మణ్యంను నియమిస్తూ డిజిపి గౌతంసవాంగ్ ఈనెల 17న ఉత్తర్వులు జారీ చేశారు. ఆ స్థానంలో ఇక్కడ పనిచేస్తున్న ఎస్.వీరభద్రుడుని చిత్తూరుకు బదిలీ చేశారు.

# 22న సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక

నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి క్రీడా మైదానంలో ఈనెల 22న సాఫ్ట్‌బాల్ సబ్‌జూనియర్ జిల్లా జట్లను ఎంపిక చేస్తామని ఆ సంఘం కార్యదర్శి సిహెచ్ కామేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 28 నుంచి 30వ తేది వరకు తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

# VPR విద్యలో జెండా పండుగ

75వ స్వాతంత్ర్య అమృతోత్సవాలను నెల్లూరులోని విపిఆర్ విద్యలో ఘనంగా నిర్వహించారు. వి.పి.ఆర్ ఫౌండేషన్ సి.ఈ.ఓ ప్రొఫెసర్ వి.నారాయణరెడ్డి జెండా వందనం చేసి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో కలిసి జాతీయగీతాన్ని ఆలపించారు.



అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య వీరుల త్యాగాలతో భరత మాత దాస్య శృంఖలాల నుండి విముక్తి పొందిందని, జాతీయ భావం అందరిలో పురివిప్పుకుందని తెలియజేశారు. వి.పి.ఆర్ ఫౌండేషన్ ఛైర్మన్, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, తిరుమల తిరుపతి దేవస్థానాల పాలక మండలి మాజీ సభ్యురాలు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సేవా దృక్పథంతో, దేశానికి తమవంతు కర్తవ్యంగా ఉచిత విద్యను అందించడం జరుగుతోందని ఆయన ఈ సందర్భంగా కొనియాడారు.



75వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నెల్లూరులోని డిప్యూటి ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో డిటిసి చందర్ ఆధ్వర్యంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండా వందనం చేస్తున్న అధికారులు, సిబ్బంది.

## చిన్ని నారాయణరావుకు
# ఆత్మీయ పురస్కారం



ఒంగోలులోని నాగభైరవ సాహిత్య పీఠం వారి ఆధ్వర్యంలో నెల్లూరుకు చెందిన ప్రముఖ కవి చిన్ని నారాయణ రావుకు ఈ నెల 16వ తేదీన ఆత్మీయ పురస్కారం ప్రదానం చేశారు. ఒంగోలు నాగభైరవ అకాడమీలో జరిగిన ఈ కార్యక్రమంలో చిన్ని నారాయణరావు సాహితీ సేవను వక్తలు అభినందించి ఘనంగా సత్కరించారు. ఈ పురస్కార సభలో డా॥ నాగభైరవ ఆదినారాయణ, మాజీ ఎమ్మెల్యే ఈదర హరిబాబు, నల్లూరి వెంకటేశ్వర్లు, తేళ్ళ అరుణ పాల్గొన్నారు. చిన్ని నారాయణరావు చేస్తున్న సాహిత్య కృషిని, సేవను పరిచయం చేస్తూ డా॥ బీరం సుందరరావు మాట్లాడారు. అనేకమంది సాహితీకారులు, కవులు పాల్గొని అభినందనలు తెలిపారు.

# తొలిరోజే 'కెవిన్నార్' ఫుల్




నెల్లూరులోని భక్తవత్సల నగర్‌లో ఉన్న కెవిఆర్ మునిసిపల్ పాఠశాలలో సీట్లు ఫుల్ అయిపోవడంతో, ఇక సీట్లు లేవంటూ హెడ్మాస్టర్ విజయ ప్రకాష్ పాఠశాల ఎదుట 'సీట్లు లేవు' అంటూ బోర్డును పెట్టేశారు. 'నాడు-నేడు' కార్యక్రమం కింద ప్రభుత్వం కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక వసతులతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు కలుగజేస్తుండడంతో విద్యార్థులు ఇప్పుడు ఈ పాఠశాలల్లో చేరేందుకే ఎక్కువగా ఆసక్తిచూపుతున్నారు. దీంతో పాఠశాల తెరచిన రోజే సీట్లు నిండిపోయాయి. ఇప్పటికే ఈ స్కూల్‌లో 2128 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇంకా ఎక్కువగా విద్యార్థులు వస్తే పాఠశాలలో అదనపు వసతులు లేవు కనుక సౌకర్యాలు కరువై విద్యార్థులు ఇబ్బందిపడతారని భావించి పాఠశాల కమిటీ వారు అక్కడి గేటు వద్ద ఈ బోర్డును ఏర్పాటుచేశారు. కేవలం ఆరవ తరగతి వారికి మాత్రమే కొద్ది సీట్లు ఉన్నాయని, అవి కూడా రేపోమాపో భర్తీ అయిపోతాయని చెప్తున్నారు.

# స్వాతంత్ర్య స్ఫూర్తి దీప్తులను.. చాటిన వేడుకలు





ఎందరో మహనీయుల త్యాగనిరతితో లభించిన స్వాతంత్ర్యాన్ని.. నాటి స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తి దీప్తులను గుర్తు చేసుకుంటూ.. జిల్లాలో 75వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఆగస్టు 15న నెల్లూరులో కన్నులపండువగా జరిగాయి. వాడవాడలా మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో అనేకమంది విద్యార్థులు, చిన్నారులు దేశభక్తిని చాటుకుంటూ ప్రదర్శనలిచ్చారు. నెల్లూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో ఈ సందర్భంగా పోలీసులు నిర్వహించిన మాక్ యుద్ధఘట్టాలు, ప్రభుత్వశాఖల శకటాల ప్రదర్శనలు అందరిలోనూ స్వాతంత్ర్యస్ఫూర్తిని కలిగించాయి.





- కన్నులపండువగా 75వ స్వాతంత్ర్య దినోత్సవం
- వాడవాడలా రెపరెపలాడిన త్రివర్ణ పతాక
- దేశభక్తి ఉప్పొంగే విద్యార్థుల ప్రదర్శనలు



చరిత్రాత్మకమైన రీతిలో దేశవ్యాప్తంగా ఆగస్టు 15న 75వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు ఎంతో ఘనంగా జరిగాయి. ఈసారి నెల్లూరులోనూ ఈ వేడుకలను జిల్లా ఉన్నతాధికారులు మరింత ప్రతిష్టాత్మకంగా నిర్వహించి తమ దేశభక్తిని చాటుకున్నారు. జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు నేతృత్వంలో జరిగిన ఈ వేడుకల్లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి పాల్గొని పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి జాతీయజెండాను ఆవిష్కరించి వందనాలర్పించారు. జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు, ఎస్పీ విజయారావులతో పాటు ఎమ్మెల్యేలు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు బల్లి కల్యాణ్‌చక్రవరి, వాకాటి నారాయణ రెడ్డి, రాష్ట్ర సంగీత నృత్య అకాడమీ ఛైర్మెన్ పి.శిరీష ఇంకా పలువురు స్వాతంత్ర్య సమరయోధులు, ప్రముఖులు, ఉన్నతాధికారులు, విద్యార్థులు పాల్గొని జెండా వందనం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మహాత్మాగాంధీజీ, నేతాజీ సుభాష్‌చంద్రబోస్, రవీంద్రనాథ్ టాగూర్, సరోజినీనాయుడు తదితర దేశనేతల సైకత శిల్పాలు సందర్శకులను బాగా ఆకట్టుకున్నాయి. దేశభక్తి ఉప్పొంగేలా జనహిత వాత్సల్య అనాధ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన 'స్వాతంత్ర్య పోరాట యోధుడు సైరా..నరసింహారెడ్డి' ప్రదర్శన, విశ్వభారతి హైస్కూలు విద్యార్థులు నిర్వహించిన 'భిన్నత్వంలో ఏకత్వం', ఆదిగురు శ్రీ శివసాయి కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన 'మనదేశం-భారత దేశం' ప్రదర్శనలు బాగా ఆకట్టుకుని అందరి ప్రశంసలందుకున్నాయి. ఈ సందర్భంగా డిఆర్‌డిఏ ఆధ్వర్యంలో 22512 స్వయం సహాయక సంఘాల సభ్యులకు బ్యాంకు లింకేజి ద్వారా 564.68 కోట్ల రూపాయల రుణాలను అందజేశారు. 30 మంది దివ్యాంగులకు 3.87 లక్షల రూపాయల విలువైన ఉపకరణాలు, ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 1.07 కోట్ల విలువైన ట్రాక్టర్లు, ఐటిడిఏ ఆధ్వర్యంలో 90 వేల విలువైన తైవాన్ స్ప్రేయర్లను లబ్దిదారులకు అందజేశారు. వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందిస్తున్న 442 మంది ఉద్యోగులు, స్వచ్ఛంధసేవకులకు స్వాతంత్ర్యదినోత్సవ అవార్డులు అందజేసి సత్కరించారు.

### ప్రజల ముంగిళ్ళకే.. 'నవరత్నాలు'

మంత్రి బాలినేని మాట్లాడుతూ ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందని, నాటి దేశభక్తులను గుర్తుచేసుకుంటూ వారికి ఘన నివాళులర్పించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం నవరత్న పథకాలను అమలు చేస్తూ ప్రజలకు ఎన్నోరకాల సంక్షేమ పథకాలను అందజేస్తోందన్నారు. ఒకవైపు ప్రజా సంక్షేమం, మరోవైపు రాష్ట్రాభ్యున్నతి లక్ష్యంగా ప్రభుత్వం పారదర్శకంగా పని చేస్తూ ప్రజలకు సుపరిపాలన అందిస్తోందన్నారు. కోవిడ్ మహమ్మారిని నియంత్రిస్తూ జిల్లా మంత్రులు అనిల్‌కుమార్‌యాదవ్, మేకపాటి గౌతంరెడ్డి, అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో జిల్లాను ప్రగతి పథంలో నడిపిస్తుండడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాలు, పట్టణాలు, నగరాల అభివృద్ధికి, మొత్తంగా రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, సంక్షేమ ఫలాలను ప్రజలకు నేరుగా వారి ఇళ్ళ ముంగిళ్ళ వద్దకే చేరువ చేసేందుకు ప్రభుత్వం జిల్లాలో 16,460 మంది వలంటీర్లను నియమించిందని, 941 గ్రామ సచివాలయాలు, 262 వార్డు సచివాలయాలు, 680 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటుచేసి ప్రజలకు, రైతులకు అనేక రకాలైన పథకాలను అందజేస్తోందని వివరించారు. పేదలకు ఇళ్ల స్థలాలు, లబ్దిదారులకు ఇళ్ళ నిర్మాణాలు చేస్తూ ప్రభుత్వం ప్రజల మన్ననలు అందుకుంటోందని తెలిపారు. అటు వ్యవసాయపరంగా, ఇటు పారిశ్రామికంగా జిల్లాను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ముమ్మర కృషి జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్లు హారేందిరప్రసాద్, గణేష్‌కుమార్, విదేహ్ ఖరే, రోజ్‌మాండ్, డిఎఫ్ఓ షణ్ముఖ కుమార్, ట్రైనీ కలెక్టర్ అహ్మద్‌ఖాన్, కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్, డిఆర్ఓ చిన్నఓబులేశు, అడిషనల్ ఎస్పీ వెంకటరత్నం, సెబ్ జేడీ శ్రీలక్ష్మి, ఏఆర్ అదనపు ఎస్పీ వీరభద్రుడు, ఏఆర్ డిఎస్పీ గాంధీ, డిపిఓ ధనలక్ష్మి, జడ్పీ సిఇఓ సుశీల, డిటిసి చందర్, హౌసింగ్ పీడీ శేషయ్య, వ్యవసాయశాఖ జేడీ శివన్నారాయణ, డిఆర్‌డిఏ పీడీ సాంబశివారెడ్డి, ఆర్డీఓ హుస్సేన్‌సాహెబ్, డిఎస్పీలు శ్రీనివాసులురెడ్డి, హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

## వియస్‌యులో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో 75వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి ముఖ్యఅతిధిగా పాల్గొని జెండా ఆవిష్కరించారు. 75 సంవత్సరాల క్రితం మహనీయులు చేసిన త్యాగాలను, బలిదానాలు గురించి జ్ఞాపకం చేశారు. స్వాతంత్ర్యానంతరం గడచిన 75 సంవత్సరాలలో దేశం ఎంతో వ్యయప్రయాసలకు ఓర్చి ఎంతో పురోగతి సాధించిందని తెలిపారు. ఒలింపిక్స్‌లో మన దేశ క్రీడాకారులు సాధించిన పథకాలే ఇందుకు నిదర్శనమన్నారు. విద్యార్థులందరూ దేశ ప్రగతికి పాటుపడాలని కోరారు. విద్య అందరికి అందుబాటులో ఉండాలని ఆకాంక్షించి ఎంతో కష్టపడి డా. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఈ విశ్వవిద్యాలయాన్ని స్థాపించటం జరిగిందన్నారు. అలాగే కోవిడ్ వలన ఆర్థిక భారం ఉన్నా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాలలో పెనుమార్పులకు శ్రీకారం చుట్టి పురోగతిని సాధించారని అన్నారు. అనంతరం మొక్కలు నాటి అందరూ పచ్చదనాన్ని పెంచేందుకు కృషిచేయాలని తెలిపారు. చివరిగా కోవిడ్ 19 సమయంలో, అలాగే యూనివర్సిటీ హెర్బల్ గార్డెన్‌లో శ్రమదానం చేసిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు ప్రశంసాపత్రాలను రెక్టార్ యం.చంద్రయ్య చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వియస్‌యు రిజిస్ట్రార్ డా. యల్.విజయకృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ సుజా ఎస్ నాయర్, అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు ఎన్‌సిసి క్యాడెట్స్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## విశ్వసాయిలో...



75వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మాగుంట లే అవుట్‌లోని విశ్వసాయి కళాశాలలో జాతీయ పతాక ఆవిష్కరణ జరిగింది. కళాశాల డైరెక్టర్ కృష్ణమోహన్ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ జ్ఞానాన్ని ప్రసాదించేది గురువులేనని, ఆనాటి మహానుభావుల మాతృదేశ సేవ, గురువులు అందించే విద్యాసేవ రెండూ మరచిపోలేనివని వివరించారు. ఎవరికి వారు తమ బాధ్యతను గుర్తించి ప్రవర్తిస్తే మనకు జన్మనిచ్చిన మాతృదేశ గౌరవాన్ని పరిరక్షించిన వారమవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొని జెండా వందనం చేశారు.

## శ్రీసిటీలో రెపరెపలాడిన మువ్వన్నెల జెండా



శ్రీసిటీలో ఆగస్టు 15న 75వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. బిజినెస్ సెంటర్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో గుమ్మడిపూండి పోలీస్ సూపరింటెండెంట్ రీతు ముఖ్యఅతిథిగా పాల్గొని శ్రీసిటి డిఎస్పీ జగదీష్ నాయక్ సమక్షంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రీతు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను మరచిపోలేమంటూ వారికి నివాళులర్పించారు. కాగా, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఒక ప్రకటనలో శ్రీసిటీ సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ సమర్ధవంతమైన నాయకత్వంలో పనిచేస్తూ ఆత్మనిర్భర్ భారత్ దిశగా 'మేక్ ఇన్ ఇండియా', 'మేక్ ఫర్ వరల్డ్' ప్రణాళికలకు అనుగుణంగా ప్రపంచానికి సేవలందిస్తూ దేశం సత్తా చాటుతున్నాయన్నారు. ఇదే బాటలో శ్రీసిటీ ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలకు చెందిన దాదాపు 200 కంపెనీలతో, దేశంలో మెగా పారిశ్రామిక పార్కుల్లో ఒకటిగా అవతరించిందన్నారు. ఉత్పాదక కేంద్రంగా మారడం, ఉద్యోగాల కల్పనకు ఉత్తేజాన్ని ఇవ్వడం, ఆర్థిక వ్యవస్థను వేగవంతమైన మార్గంలోకి తీసుకెళ్లడం వంటి ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా శ్రీసిటీ తన వంతు కృషి చేస్తుందన్నారు.

### అవార్డులు, రివార్డులు...



స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీసిటీ యాజమాన్యం పలువురికి అవార్డులు, రివార్డులు అందచేసింది. ఇందులో భాగంగా తమ విధుల్లో ఉత్తమ సేవలు అందించిన 12 మంది సెక్యూరిటీ గార్డులకు 'ఉత్తమ సేవా' అవార్డులను రీతూ, జగదీష్ నాయక్ చేతుల మీదుగా అందచేశారు. శుచి-శుభ్రతకు ప్రాధాన్యత ఇచ్చిన తూర్పు మల్లవారిపాలెం, చెరివి, మత్తేరిమిట్ట పంచాయితీలను గుర్తించి, ఆయా గ్రామాల సర్పంచులు పార్వతి సన్యాసయ్య, డి.రత్నమ్మ, సింధుజ హరిబాబురెడ్డిలకు 'స్వచ్ఛత రివార్డు'లను ఇచ్చారు. అలాగే గ్రామాల్లో పరిశుభ్రతను కాపాడటంలో చురుకైన పాత్ర పోషించినందుకు శ్రీసిటీ పరిసరాల్లోని అన్ని గ్రామాలకు చెందిన 13 మంది వాలంటీర్లను ఎంపిక చేసి, వారికి నగదు పురస్కారాలను పంపిణీ చేశారు.



## సుప్రీం కోర్టు చేతిలో

# ఇరుక్కుపోయిన కేంద్రం జుట్టు!!

ఊహించినట్టే అవుతున్నది. మొబైల్‌ఫోన్లపై నిఘాపెట్టే సాఫ్ట్‌వేర్‌ను ఇజ్రాయెల్ కంపెనీ నుంచి కొనుగోలు చేసిందీ లేనిదీ చెప్పక తప్పని పరిస్థితి కేంద్రానికి మెలమెల్లగా ఎదురవుతున్నది. ఈ స్పైవేర్ ద్వారా కొందరు ప్రముఖుల ఫోన్లు 'ఎవరో...' రహస్యంగా వింటున్నారు అంటూ... కొందరు ప్రముఖుల పేర్లు మీడియాలో వచ్చాయి. 'అవును. మేమూ ఆ పేర్లు చూశాం. అవి బయటకు ఎలా వచ్చాయో దర్యాప్తు చేస్తాం. ఓ రిటైర్డ్ న్యాయమూర్తితో...' అని కేంద్రం గనుక ముందే ప్రకటించి ఉంటే పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను స్తంభింపచేసే అవకాశం లభించేది కాదు. పార్లమెంట్‌ను, ప్రజాస్వామ్యాన్ని ప్రతిపక్షాలు అవమానపరిచాయంటూ ప్రధానమంత్రి ఆవేదనకు లోనయ్యే పరిస్థితి ఉండేది కాదు. (ఏ మాటకు ఆ మాటే చెప్పుకోవాలి. పార్లమెంట్ అన్నా, ప్రజాస్వామ్యం అన్నా ఆయనకు చాలా గౌరవం. అందుకే, ఆయన మనసు అంతగా నొచ్చుకున్నది.)

దేశవ్యాప్తంగా ఈ అంశం మీద ఇంత రగడ జరగవలసిన అవసరం ఏర్పడి ఉండేది కాదు. జర్నలిస్టులు సుప్రీం కోర్టు తలుపు తట్టాల్సిన అవసరం ఏర్పడి ఉండేది కాదు. 'పెగాసెస్‌ను మీరు వాడారా...? లేదా...?' అని కేంద్రాన్ని సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి ప్రశ్నించవలసిన పరిస్థితి ఎదురయ్యేది కాదు.



నిజానికి, 'రిటైర్డ్ న్యాయమూర్తితో విచారణ' అనేది ప్రభుత్వాలను గట్టెక్కించే గొప్ప టెక్నిక్. ఆ విచారణను ఎంత కాలమైనా సాగదీయవచ్చు. ఆ నివేదికను పరిశీలిస్తున్నాం అనవచ్చు. చివరికి, ఆ నివేదికను మేము ఆమోదించడం లేదు అనవచ్చు. అప్పటికి ప్రతిపక్షాలకు నడుం పట్టేస్తుంది. ఓపిక నశిస్తుంది. జనం మరిచిపోతారు. ప్రభుత్వాలు 'యథా విధి' తమకు నచ్చిన విధంగా అధికారంతో ఆడుతూ.. పాడుతూ కాలక్షేపం చేసేయవచ్చు. దేశాన్ని ఏమార్చడానికి ఇంతటి 'రాజ మార్గం' ఉండగా ప్రభుత్వం ఎందుకు ఇరకాటంలో పడిపోయిందో అర్థం కావడం లేదు. ఆ మాత్రం 'సంతోషం' అయినా ప్రతిపక్షాలకు దక్కడం ఎందుకు అని 'వారిద్దరూ' అనుకున్నారేమో తెలియదు. ప్రధాని మోదీకి 'భేషజం' అడ్డం వచ్చింది. 'ఆఫ్టాల్ ప్రతిపక్షాల వాళ్ళు... కేంద్రాన్ని నిలదీస్తారా?' అన్న భావన అయివుండవచ్చు. ప్రతిపక్షాల పట్ల చిన్న చూపు అయివుండవచ్చు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు శుభ్రంగా తుడిచిపెట్టుకుపోతున్నా... 'ఔను... కాదు...' అంటూ నోరు మెదపలేదు. ఇక, దీని తర్వాత వచ్చేది, శీతాకాల సమావేశాలు. ఈ ట్రెండ్ చూస్తుంటే అవీ తుడిచిపెట్టుకుపోవచ్చు. అయినా, మోదీజీకి 'ఆత్మ నిబ్బర్' బాగా ఎక్కువ. చలించే ప్రశ్నే లేదు. తనకున్న 56 అంగుళాల చాతి ప్రతిపక్షాలలో ఏ ఒక్కరికీ లేదనే విషయం ఆయనకు తెలుసు. అందుకే, ప్రతిపక్షాల 'గోల' అరణ్య రోదనం అయిపోయింది. చెవిటివాని ముందు ఊదిన శంఖం అయిపోయింది.

మొత్తం విషయం సుప్రీం కోర్టుకు చేరింది. ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ నేతృత్వంలోని ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం ముందుకు ఈ వ్యాజ్యం వచ్చింది. కేంద్రం ఈ స్పైవేర్.. పెగాసెస్‌ను ఉపయోగించిందో... లేదో చెప్పాలి అనేది ఈ వ్యాజ్య సారాంశం. పిటిషనర్ల తరపున వాదిస్తున్నది కపిల్ సిబల్. మామూలుగానే, కోడిగుడ్డుకు ఈకలు పీకే కపిల్‌సిబల్‌కు ఏకంగా బ్రాయిలర్ కోడే దొరికేసినట్టయింది. ఈ విషయంలో ప్రభుత్వం తరపున దాఖలయిన సమాధానం చూసి, న్యాయమూర్తులు అసహనం వ్యక్తం చేశారు. 'ఈ సాఫ్ట్‌వేర్‌ను వాడాము... వాడలేదు... అని చెప్పడం కూడా చాలా సున్నితమైన అంశమని దేశ భద్రత అంశాలు ప్రభావితమయ్యే ప్రమాదం ఉన్నదని, కోర్టులు కూడా దేశ భద్రతకు సంబంధించిన అంశాలలో వేలు పెట్టగూడదని, ఇంతటి సున్నితమైన అంశాలలో రొటీన్‌గా 'అఫిడవిట్' దాఖలు చేయడం కుదరని పని అంటూ ప్రభుత్వం తరపున వాదించిన తుషార్ మెహతా మెలికలు తిరిగిపోయారు. అసలు పెగాసెస్ ప్రస్తావనే దేశద్రోహం అన్న రేంజ్‌లో ఆయన మాట్లాడారు. న్యాయమూర్తులకు విషయం అర్థమైంది. ఈ విషయంలో చెప్పవలసిన 'ఎస్.. ఆర్... నో' చెప్పకుండా, కేంద్రం కోర్టుతో కూడా దాగుడు మూతలు ఆడుతున్నదని న్యాయస్థానం భావించింది. ఇక, లాభం లేదని కేంద్రానికి, పిటిషనర్లకు నోటీసులు జారీ చేసింది, విచారణకు రెడీ అవ్వండి అంటూ. మరో పది రోజులలో 'పెగాసెస్' అనే థ్రిల్లింగ్ సినిమా మొదలుకాబోతోంది.

అనేక ప్రశ్నలకు సుప్రీం కోర్టులో కేంద్రం సమాధానం చెప్పాల్సి ఉంటుంది.

1. ఎస్ ఆర్ నో...?
2. 'ఎస్' అయితే... ఎప్పటి నుంచి?
3. ఇజ్రాయిల్ కంపెనీ నుంచి ఎంతకి కొన్నారు?
4. కొనమని ఎవరు ఆదేశించారు?
5. ఇప్పటి వరకు ఎవరి ఫోన్‌ను ఎంతకాలం నుంచి ఎవరు వింటున్నారు?
6. ఆ విషయాన్ని ఎందుకు దాచిపెట్టారు?

ఇలా... బోలెడన్ని ప్రశ్నలు, ఉప ప్రశ్నలు, అనుబంధ ప్రశ్నలు.

ఈ గోల అంతా దేనికిలే అని 'మేం కొనలేదు' అంటే...

1. దీనిపై దర్యాప్తుకు ఎందుకు అదేశించలేదు?
2. ఫ్రాన్స్, ఇజ్రాయిల్ ఆదేశిస్తే... మీకేమిటి ఇబ్బంది?
3. ఇప్పటికైనా ఆదేశిస్తారా?
4. లేక, మమ్మల్ని ఆదేశించమంటారా?

అంటూ సుప్రీం కోర్టు ప్రశ్నల వర్షం కురిపించే అవకాశం ఉంది.

విషయాన్ని పక్కదారి పట్టించడానికా అన్నట్టుగా... 'జమిలి ఎన్నికలు నిర్వహించే విషయం కేంద్రం పరిశీలనలో ఉంది...' అంటూ ఓ కేంద్ర మంత్రి ప్రకటించారు. అయినా, ఆ ప్రకటన జనం దృష్టిని ఆకర్షించినట్టు కనిపించలేదు. ప్రతిపక్షాలు ఈ పెగాసెస్ మైండ్‌సెట్‌లో ఉండడం ఓ కారణమై ఉండవచ్చు.

సుప్రీం కోర్టులో కూడా ఈ అంశం ఇప్పటికిప్పుడు తేలకపోవచ్చు. ఒక ఏడాది పట్టినా ఆశ్చర్యం లేదు. అఫిడవిట్లు.... కౌంటర్ అఫిడవిట్లు... వాదోపవాదాలు... వాయిదాలు... శని, ఆదివార సెలవులు, పండుగ... పబ్బాల సెలవులు... తేలిగ్గా ఓ ఏడాది లాగేస్తుంది. మరో ఏడాదికి జస్టిస్ రమణ రిటైర్ కావలసి ఉంది కనుక, 'పెగాసెస్' తీర్పు...అప్పటివరకు లాగేసినా ఆశ్చర్యం లేదు. ఈలోపు, ఈ కేసు ఎన్ని మలుపులు తిరుగుతుందో ఓపికగా చూద్దాం!

**- భోగాది వేంకట రాయుడు**
bhogadirayudu2152@gmail.com




# కళ్యాణ వైభవం...!




సీనియర్ జర్నలిస్టు, గుండవోలు వాస్తవ్యులు మలిరెడ్డి జయరామిరెడ్డి మనుమడు **పవన్ తేజ రెడ్డి - విశ్విత** (సంగం మండలం, మర్రిపాడు గ్రామ వాస్తవ్యులు మేనకూరు రాఘవరెడ్డి - సుమలతల కుమార్తెల వివాహం ఈ నెల 12వ తేదీ నెల్లూరులోని డా॥ శేషారెడ్డి కళ్యాణ మండపంలో వైభవంగా జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



# గూడూరు డివిజన్ వార్తలు

## అడుగడుగునా దేశభక్తి



గూడూరులో 75వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఈ నెల 15న ఘనంగా నిర్వహించారు. మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. అడుగడుగునా దేశభక్తి ఉట్టిపడింది. నేతలు, అధికారులు పార్టీ కార్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఆర్టీవో మురళీకృష్ణ, డిఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే వరప్రసాదరావు జాతీయ జెండా ఆవిష్కరించారు. గూడూరు కోర్టులో ఏడో అదనపు జిల్లా జడ్జి ఎస్.రమణయ్య ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ లీలారాణి, గూడూరు రూరల్ సిఐ శ్రీనివాసులురెడ్డి, అర్బన్ సిఐ నాగేశ్వరమ్మ, ఎస్సైలు తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోవిడ్ విపత్తులో సేవ చేసిన సంస్థలకు అవార్డులు అందజేశారు.

## 11న జాతీయ లోక్‌అదాలత్



సెప్టెంబర్ 11వ తేదీన గూడూరు కోర్టు ప్రాంగణంలో జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు 7వ అదనపు జిల్లా జడ్జి ఎస్.రమణయ్య ఈ నెల 17వ తేదీ ఒక ప్రకటనలో తెలిపారు. రాజీకి అనువైన కేసులన్నీ లోక్‌అదాలత్‌లో రాజీ చేసుకోవాలని చెప్పారు. కక్షిదారులు, న్యాయవాదులను సంప్రదించి ఇరు వర్గాల అంగీకారంతో కేసులు రాజీ చేసుకోవాలని తెలిపారు.



నెల్లూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఈ నెల 15న జరిగిన 75వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు, ఎస్పీ విజయారావుల చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న నెల్లూరు నగర 4వ పట్టణ సి.ఐ దశరథరామారావు

## ఈ-చలానాలు చెల్లించండి

**- ఎస్సై బ్రహ్మనాయుడు**



గూడూరులోని టవర్‌క్లాక్ సెంటర్‌లో జిల్లా ఎస్పీ విజయరావు ఆదేశాలమేరకు గుడూరు పట్టణ సిఐ నాగేశ్వరమ్మ సూచనలతో ఎస్సై బ్రహ్మనాయుడు ఈ నెల 18న వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు ఈ-చలానాల విషయంలో అశ్రద్ధగా ఉండొద్దని, ఈ-చలానాలు పెండింగ్‌లో ఉంటే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. పలువురు మైనర్లు వాహనాలు తోలుతూ పట్టుబడడంతో చలానాలు విధించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చి పంపారు. ఈ వాహన తనిఖీల్లో సిబ్బంది మస్తాన్, సురేష్ పాల్గొన్నారు.



గుంటూరు నగరంలో హత్యకు గురైన దళిత విద్యార్థిని రమ్య కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్ళిన తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, తెలుగుదేశం నాయకులను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఇటీవల పట్టణంలోని పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తూ రోడ్డుపై బైటాయించిన మాజీఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, తెదేపా నాయకులు, కార్యకర్తలు.

# ఇద్దరు పోలీసు అధికారులకు సేవా పతకాలు


డిఎస్పీ జె.శ్రీనివాసులురెడ్డి


ఏఆర్ ఎస్ఐ ఎం.వెంకటేశ్వర్లు

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు పోలీసు అధికారులకు ప్రతిష్ఠాత్మకమైన ఇండియన్ పోలీస్ మెడల్ లభించింది. కేంద్ర హోంశాఖ ప్రకటించిన అవార్డుల జాబితాలో నెల్లూరు నగర డిఎస్పీ జె.శ్రీనివాసులురెడ్డి, ఏఆర్ ఎస్ఐ మేడిద వెంకటేశ్వర్లు ఉండడంతో జిల్లా పోలీసువర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. విధి నిర్వహణలో అత్యుత్తమ సేవలందిస్తున్నందుకు వీరికి ఈ అవార్డులు లభించాయి. శ్రీనివాసులురెడ్డి స్వస్థలం చిత్తూరుజిల్లా పుంగనూరు మండలం చంద్రమాకులపల్లి కాగా, వెంకటేశ్వర్లు స్వస్థలం నెల్లూరు నగరం. వీరిరువురి విశిష్టసేవలకు గతంలో కూడా పలు అవార్డులు లభించాయి. విశిష్ట సేవాపతకాలు పొందిన వీరిద్దరినీ జిల్లా ఎస్పీ సిహెచ్ విజయారావు అభినందించారు.

# లక్షల్లో బకాయిలు.. చెల్లించేదెప్పుడు?

## మధ్యాహ్నభోజన కార్మికుల ఆవేదన



జిల్లాలో అట్టహాసంగా జరుగుతున్న మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన బకాయిలు లక్షల్లో పేరుకుపోతున్నా ప్రభుత్వం వాటిని చెల్లించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇక విద్యార్థులకు, పాఠశాలల్లోని చిన్నారులకు మధ్యాహ్న భోజనం ఎలా పెట్టాలో తెలియడం లేదు. ఇప్పటికే అప్పులు చేసి అన్నం పెడుతున్నాం.. మళ్ళీ మళ్ళీ అప్పులు చేయాలన్నా ఎవరూ ఇవ్వడం లేదంటూ మధ్యాహ్న భోజన కార్మికులు ఆవేదన చెందుతున్నారు.

ఈనెల 16న నెల్లూరులోని కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆంధ్రప్రదేశ్ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ నెల్లూరుజిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నాందోళన నిర్వహించారు. ఈ ఆందోళనలో ఆ సంఘం నాయకురాళ్ళు కె.విజయమ్మ, షేక్ రహెనాబేగంలు మాట్లాడుతూ జిల్లాలోని మధ్యాహ్నభోజనం కార్మికులకు రావాల్సిన బకాయిలను చెల్లించకపోవడం దారుణమన్నారు. కరోనా నేపథ్యంలో పనులు లేక ఇబ్బందులు పడుతున్న ఆ నిరుపేద కుటుంబాలు ఈ పథకం అమలుకోసం చేస్తున్న అప్పులతో మరింతగా కుదేలైపోతున్నారని, హైస్కూళ్ళలో అన్నం వండి పెడుతున్న కార్మికులకు లక్షల రూపాయల్లో, ప్రాథమిక పాఠశాలల్లో వేలాది రూపాయల్లో బకాయిలున్నాయని వారు పేర్కొంటూ ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు ఇకనైనా పరిశీలించి బకాయిలు చెల్లించి కార్మికులను ఆదుకోవాలని కోరారు. ఈ ఆందోళనలో నాయకులు బత్తల రత్తయ్య, షాహినాబేగం, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

## కన్నులపండువగా

# శ్రీవారి కల్యాణం



నెల్లూరు మాగుంట లే-అవుట్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 14న స్వామివారి కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం శాంతి హోమం నిర్వహించారు. తొలుత స్వామి వారికి, అమ్మవార్లకు శోభాయమానంగా అలంకారాలు చేసి విశేష పూజలు చేశారు. శ్రావణమాసాన్ని పురస్కరించుకుని ఆగస్టు 31వ తేదీ దాకా స్వామివారికి విశేష పూజలు జరుగుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

## 141 మంది కార్యదర్శులకు

# షోకాజ్ నోటీసులు

## డిపిఓ ధనలక్ష్మి



జిల్లా పంచాయతీ అధికారి ఎం.ధనలక్ష్మి ఏక కాలంలో 141 మంది పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేసి ఉద్యోగవర్గాల్లో సంచలనం సృష్టించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న బయోమెట్రిక్ హాజరు విధానాన్ని పాటించని వారికి షోకాజ్‌లు ఇచ్చారు. ఈనెల 16వ తేదీ ఉదయం బయోమెట్రిక్ వేయని 141 మంది పంచాయతీ కార్యదర్శులను గుర్తించి, వారిపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో ఐదు రోజుల లోపల సంజాయిషీ ఇవ్వాలని ఆదేశాలిచ్చారు.

# 29న క్రీడా ప్రతిభా పురస్కారాలు

## ముక్కాల ద్వారకానాథ్




హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి, జాతీయ క్రీడల దినోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 29న జిల్లా క్రీడాకారులను ప్రోత్సహిస్తూ క్రీడా ప్రతిభా పురస్కారాలను అందజేస్తామని సింహపురి స్పోర్ట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, నుడా ఛైర్మెన్ ముక్కాల ద్వారకనాథ్ చెప్పారు. ఇటీవల నెల్లూరులోని ఫౌండేషన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2020–21 సంవత్సరాలకు కలిపి ఈ అవార్డులను ప్రదానం చేస్తామన్నారు. ఈ పురస్కారాలను తమ దరఖాస్తులను ఈనెల 20తేదీలోగా పంపాలన్నారు. వివరాలకు 98090 23456 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు. ఫౌండేషన్ ఏర్పడి పదేళ్ళు పూర్తయిన సందర్భంగా ఈ ఏడాది అంతర్జాతీయస్థాయిలో రాణించిన క్రీడాకారులు, కోచ్‌లకు వాళ్ళు జీవితకాలం చేసిన సేవలకు గుర్తింపుగా జీవితసాఫల్య పురస్కారాలుగా 'క్రీడారత్న' అవార్డుతోపాటు, 'క్రీడాగురు' అవార్డులను కూడా ఈ ఏడాది నుంచి బహుకరిస్తామని తెలిపారు. ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి నిమ్మల వీరవెంకటేశ్వర్లు, సభ్యులు మద్దిపాటి ప్రసాదరావు, సీనియర్ క్రీడాకారులు చలువాది శరణ్, బైసాని సత్యకృష్ణ పాల్గొన్నారు.

## కోవిడ్ కేసుల పర్యవేక్షణకు..

# మండలాల్లోనూ 104 కాల్‌సెంటర్లు

కోవిడ్ కేసులను పర్యవేక్షించేందుకు మండలాల్లో కూడా 104 కాల్‌సెంటర్ల ఏర్పాటుకు జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కోవిడ్ పాజిటివ్ వచ్చినవారిని గుర్తించడం, ఆసుపత్రులకు చేర్చడం వగైరా చర్యలన్నిటినీ 104 కాల్‌సెంటర్ల ద్వారా మానిటరింగ్ చేస్తామని, అందువల్ల మండల కేంద్రాల్లో కూడా 104 కాల్‌సెంటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జడ్పీ సిఇఓ సుశీల ఇటీవల ఎంపిడిఓలను ఆదేశించారు. ఆ కాల్‌సెంటర్లకు అవసరమైన సిబ్బందిని, ఫర్నిచర్‌ను కూడా ఏర్పాటుచేయాలని ఆమె సూచించారు.

# డిఎస్ఓగా డెప్యుటేషన్‌పై వెంకటేశ్వర్లు

జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిగా విజయవాడలో డెప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న టి.వెంకటేశ్వర్లును ప్రభుత్వం డెప్యుటేషన్‌పై నెల్లూరులో నియమిస్తూ తాజాగా ఉత్తర్వులిచ్చింది. ఈ స్థానంలో ఇప్పటిదాకా ఇన్‌చార్జి డిఎస్ఓగా పనిచేస్తున్న సుధాకర్ జిల్లా పౌరసరఫరా సంస్థ విజిలెన్స్ అధికారిగా కొనసాగేలా ప్రభుత్వం నిర్ణయించింది.

# అగస్త్య మహాముని ప్రతిష్ఠించిన.. శ్రీ ఘటిక సిద్ధేశ్వర క్షేత్రం

**త్రేతాయుగం నాటి పరమ పవిత్రమైన పుణ్యక్షేత్రం.. సాక్షాత్తూ అగస్త్య మహాముని ప్రతిష్ఠించిన మహనీయ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన దేవాలయం.. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సీతారామపురం మండలంలోని శ్రీ ఘటిక సిద్ధేశ్వరాలయం. కోరిన కోర్కెలు నెరవేర్చే ఘటిక సిద్ధేశ్వరుడుగా పరమశివుడు ఇక్కడ కొలువై ఉండగా, అమ్మవారు శ్రీ ఇష్టకామేశ్వరిదేవిగా భక్తుల పూజలందుకుంటూ ఉండడం విశేషం. ఇటీవలి కాలంలో అవధూత కాశినాయన ఈ ఆలయాన్ని జీర్ణోద్ధరణ గావించి అద్భుతంగా తీర్చిదిద్ది భక్తులోకానికి సమర్పించారు. ఈ ఆలయం ఆవిర్భావానికి సంబంధించి పురాణ కథనాలతో పాటు, ఆసక్తికరమైన విషయాలెన్నో ఉన్నాయి.**

చుట్టూతా కొండలు కోనలు.. ఆహ్లాదకరమైన ప్రకృతి రమణీయ సోయగాల మధ్య భక్తులకు అభయప్రదాతగా, కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా సాక్షాత్తూ ఆ పరమేశ్వరుడే ఘటిక సిద్ధేశ్వరుడుగా ఇక్కడ స్వయంభువుగా ఉద్భవించాడు. త్రేతాయుగంలో అగస్త్య మహాముని ఈ ప్రాంతంలో తపమాచరించగా పరమేశ్వరుడు ఇక్కడ ప్రత్యక్షమై ఆ మహాముని కోరిక మేరకు ఒక గుటక వేసేలోగానే సిద్ధేశ్వరునిగా ఇక్కడ ఆవిర్భవించడంతో ఈ ఆలయానికి గుటక సిద్ధేశ్వరస్వామి అనే పేరు వచ్చిందని పురాణ కథనం. అదే కాలక్రమేణ 'ఘటిక' సిద్ధేశ్వరస్వామిగా వాడుకలోకి వచ్చిందని పెద్దలు చెప్తుంటారు.







## మన దేవాలయాలు (61)

### ఆలయ చరిత్ర

మండల కేంద్రమైన సీతారామపురానికి సుమారు 13 కిలోమీటర్ల దూరంలో చుట్టూ పచ్చని చెట్లు, కొండ కోనల మధ్య ఆహ్లాదకరమైన, సుప్రశాంత ఆధ్యాత్మిక వాతావరణంలో ఈ దేవాలయం ఉంది. స్వామివారు, అమ్మవారు ఇక్కడ స్వయంభువులుగా వెలిశారని, స్వామివార్లను కొలిచే భక్తుల కోరికలు నెరవేరుతాయని గట్టి నమ్మకం. త్రేతాయుగం నాటి ఈ దేవాలయం ఎంతో అపూర్వమైనదని ప్రతీతి. కాలక్రమేణా శిథిలావస్థకు చేరిన ఈ ఆలయాన్ని నాటి రాజుల కాలంలో హరిహరరాయలు, బుక్కరాయలు, ఆ తర్వాత శ్రీకృష్ణదేవరాయలు ఎంతో అభివృద్ధి చేశారని, ఇటీవలి కాలంలో అంటే.. సుమారు అరవై ఏళ్ళ క్రితం అవధూత కాశినాయన అటవీప్రాంతంలో ఉన్న ఈ దివ్యక్షేత్రాన్ని గుర్తించి జీర్ణోద్ధరణ గావించి ఆలయానికి పూర్వవైభవం తెచ్చారని భక్తులు చెప్తుంటారు. అందుకు నిదర్శనంగా ఇక్కడ కాశినాయన మందిరం ఉంది. ఇక్కడికి వచ్చే భక్తులకు అన్నపానాదులకు కొదవ లేకుండా కాశినాయన ఏర్పాటుచేసిన నిత్యాన్నపథకం కూడా కొనసాగుతోంది.


### కార్తీకమాసంలో భక్తుల సందడి

ప్రతినిత్యం ఘటిక సిద్ధేశ్వరస్వామివారికి, అమ్మవారికి నిత్యపూజలతో పాటు ప్రతిఏటా కార్తీకపౌర్ణమి, మహాశివరాత్రి, దేవీనవరాత్రుల రోజుల్లో రాష్ట్రరాష్ట్రేతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు గణనీయంగా తరలివస్తుంటారు. ఏదేమైనా భక్తవరదుడైన శ్రీ ఘటిక సిద్ధేశ్వరస్వామి అనుగ్రహం ఉంటే చాలు ఎలాంటి కష్టాలున్నా మటుమాయమై జీవితాలు శుభప్రదంగా సాగుతాయని వేరే చెప్పనక్కర లేదు.

### ఎన్నో ప్రత్యేకతలు... మరెన్నో విశేషాలు

ఓం నమఃశివాయ అంటూ.. ఎప్పుడూ శివ నామస్మరణలతో మార్మోగే ఈ ఆలయంలో అన్నీ ప్రత్యేకతలే. ఆలయం లోపలికి వెళ్లేందుకు వీలుగా అద్భుతమైన రీతిలో ఏర్పాటుచేసిన అయిదు శిరస్సుల నాగదేవత ద్వారం ఒక విశేషం. ఏకశిలా ధ్వజస్తంభం, సప్త కోనేరులు, అగస్త్యమహాముని తపమాచరించిన చోటును పదిలంగా ఉంచే అగస్త్యపీఠం, విఘ్నేశ్వర మందిరం, వేసవి కాలంలో కూడా ఎప్పుడూ నోటి నుంచి జలధారతో కళకళలాడే అపూర్వమైన నంది విగ్రహం, అనేక దేవతా మూర్తుల విగ్రహాలు, నాగశిలలు, నవగ్రహ మండపం, సద్గురు కాశినాయన మందిరం, శ్రీ దత్తాత్రేయస్వామి మందిరం, వీరభోగ వసంతరాయలు, శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి మందిరాలు, అయ్యప్పస్వామి మందిరం వగైరాలన్నీ భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటూ ఉంటాయి. మరో విశేషమేమంటే సాధారణంగా అమ్మవారు సింహ వాహనంపై లేదా పులి వాహనంపై కొలువుదీరి ఉంటారు. కానీ ఇక్కడ విలక్షణమైన రీతిలో జంబుక (నక్క) వాహనం మీద ఉండడం విశేషం. ఈ వాహనంపై అధిష్ఠించిన ఇష్టకామేశ్వరిదేవి అమ్మవారిని దర్శించుకోవడం ఎంతో మంచిదని, భక్తులకు అదృష్టమని అంటారు. ఇంకొక విచిత్రం ఆలయం ప్రాంగణంలో ఉన్న బిల్వవృక్షం. దేవతా వృక్షంగా, పరమశివునికి ప్రీతిపాత్రమైనదిగా ప్రసిద్ధి చెందిన బిల్వ వృక్షానికి సాధారణంగా మూడు ఆకులు కలిసి బిల్వపత్రంగా ఉంటాయి. అయితే ఇక్కడ ఉన్న బిల్వ వృక్షంలో మాత్రం 9 నుంచి 18 ఆకుల దాకా ఒకే బిల్వ పత్రంగా ఉండడం అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేస్తుంది!...

# కల్యాణ వైభవం...!




సోమవరపు మల్లిఖార్జునరెడ్డి - పద్మావతిల కుమారుడు హరీష్‌కుమార్‌రెడ్డి - సన్నిహిత (తుంగా నిరంజన్‌రెడ్డి - స్నేహలతల కుమార్తె)ల పరిణయం ఈ నెల 11వ తేదీ నెల్లూరులోని మినర్వాగ్రాండ్‌లో వైభవంగా జరిగింది. నూతన జంటకు 'లాయర్' శుభాభినందనలు.

# కొత్తవంగల్లులో ధాన్యం కొనుగోలు కేంద్రం

## - ప్రారంభించిన కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న



కొడవలూరు మండలం, కొత్తవంగల్లు గ్రామంలో డిసిఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఈ నెల 19న కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం రైతులు ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం 'నవరత్నాలు', పేదలందరికీ ఇళ్ళు కార్యక్రమంలో భాగంగా కొడవలూరు మండలంలోని పలు గ్రామాలకు సంబంధించి ఇళ్ళ పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ ఛైర్మెన్ వీరి చలపతిరావు, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నిరంజన్‌బాబురెడ్డి, గొల్లపల్లి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# వేమిరెడ్డిని కలసిన ద్వారక

నుడా ఛైర్మెన్‌గా ఇటీవలే నియమితులైన ముక్కాల ద్వారకానాథ్ ఈనెల 18న రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని తాడేపల్లిలో గౌరవపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 20న నగరంలో నిర్వహించనున్న తన ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి విచ్చేయాలంటూ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ద్వారకను వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అభినందించారు.

# పార్టీలో అయోమయం

(మొదటి పేజీ తరువాయి)

సాహసం ఆయన చేయలేకపోతున్నారు. మనకెందుకులే అని మిన్నకుండిపోతున్నారు. ఇక నెల్లూరుజిల్లా ఇన్‌ఛార్జులుగా ఉన్నవారిని జిల్లాలోని బడా నాయకులు తప్ప సామాన్యులు కలిసే పరిస్థితే లేదు. కాబట్టి వీరి ఆగడాలు వారి దృష్టికి వచ్చే అవకాశమే లేదు.

## ఎంపిలకు విలువే లేదు....

ఒకప్పుడు పార్లమెంటుసభ్యులంటే ఆయా రాజకీయపార్టీలలో ఎంతో ప్రాధాన్యత కల్పించేవారు. శాసనసభ్యులతోపాటు, అధికార యంత్రాంగం కూడా ఎంపిలకు సమాన మర్యాద ఇచ్చేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. శాసనసభ్యుడిని కాదని పార్లమెంటు సభ్యుడి సిఫారసును చిన్నస్థాయి అధికారి కూడా అమలు చేసే పరిస్థితి లేదు. రాజకీయంగా, సేవాపరంగా జిల్లాలో పేరుగాంచిన మాగుంట కుటుంబానికి కూడా నయా నేతలు షాకిచ్చారు. అనవసరమైన వివాదంలోకి ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డిని లాగి ఆయనపైన ఎర్రమట్టి బురద చల్లి ఆయన్ను కేసుల్లో ఇరికించే ప్రయత్నం చేశారు.

## సతమతమవుతున్న అధికారులు...

ఒకప్పుడు అధికార పార్టీ నేతలంతా ఏకతాటిపై నడిచేవారు. జిల్లాకు సంబంధించి మంత్రులు ఉంటే ఏ నియోజకవర్గానికి సంబంధించిన సమస్యనైనా సదరు మంత్రుల దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరింపచేసుకునే వాళ్ళు. ఒకవేళ ఎవరైనా తోకాడిస్తే సదరు మంత్రే విషయాన్ని నేరుగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్ళి సమస్యకు ఫుల్‌స్టాప్ పెట్టేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. ఎవరి ఇలాకా వారిదే. ఒకరి నియోజకవర్గంలో ఇంకొకరు జోక్యం చేసుకోవడానికి లేదు. ఒకవేళ చేసుకుంటే సదరు నియోజకవర్గ శాసనసభ్యుడు బూతులు తిడతాడు. వీళ్ళ పోకడతో అధికారులు కూడా బెంబేలెత్తిపోతున్నారు. కొన్ని సందర్భాలలో మంత్రులు చెప్పినా అధికారులు చిన్న ఫైలును కూడా ముందుకు కదిలించే సాహసం చెయ్యలేకపోతున్నారు.

ఇలాంటి పరిస్థితులు ఇప్పుడు రాష్ట్రమంతా కనిపిస్తున్నాయి. 25 మంది మంత్రులు ఉంటే కనీసం వారిలో సగం మంది కూడా ఇతర జిల్లాల ప్రజలకు పరిచయమే లేదు. నెల్లూరుజిల్లా విషయానికొస్తే పక్క జిల్లాలు ప్రకాశం, చిత్తూరుకు చెందిన బాలినేని శ్రీనివాసరెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నారాయణస్వామి తప్ప మిగిలిన మంత్రులు ఈ రెండున్నరేళ్లలో జిల్లాలో పర్యటించిన దాఖలాలే లేవు. ఉమ్మడి రాష్ట్రంలో అతి సామాన్యుడు సైతం మంత్రుల పేర్లు ఠక్కున చెప్పగలిగేవాళ్ళు. ఇప్పుడు పరిపూర్ణ రాజకీయ పరిజ్ఞానం ఉన్న వాళ్ళని అడిగినా 25 మంది మంత్రుల పేర్లు టకటకా చెప్పలేరు. ఒకటవ తారీఖు ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు వచ్చినా రాకపోయినా రకరకాల పథకాలద్వారా ప్రజల ఖాతాలలోకి వేలకోట్ల రూపాయలు నేరుగా పడిపోతున్నాయి. ఆ డబ్బులే మనల్ని రేపు మళ్ళీ గెలిపిస్తాయన్న ధీమాతో ఉన్నారు తప్ప, ప్రజలకు కావలసిన కనీస వసతులపై దృష్టి పెడదామన్న యావ ఈ నాయకులలో మచ్చుకైనా కనిపించడంలేదు.

ద్వితీయార్ధంలోనన్నా పరిస్థితులు మారాలని, ప్రజలకు పార్టీకి అందుబాటులో ఉండే నాయకులను మంత్రులుగా జగన్‌మోహన్‌రెడ్డి ఎంపిక చేయాలని పార్టీ శ్రేణులు, శ్రేయోభిలాషులు ఆకాంక్షిస్తున్నారు.

మొత్తంమీద నియంతృత్వ పోకడతో నేతల మధ్య ఏర్పడిన సమన్వయ లోపం పుణ్యమా అని, ఇటు పార్టీ శ్రేణులు అటు అధికారులు అయోమయంలో ఉన్నారు.

# డికెడబ్ల్యు కాలేజీలో ఉచిత వైద్యశిబిరం

నెల్లరులోని డికెడబ్ల్యు కాలేజీలో ఈనెల 18న ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కళాశాల యూత్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బందికి సుమారు 30 మందికి ఆరోగ్యపరీక్షలు చేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కరుణశ్రీ, రెడ్‌క్రాస్ కన్వీనర్ టి.శ్రీరంజని, సభ్యులు మమత, క్యాథరిన్, నాగరాజు, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ సెమిస్టర్‌లో.. 'కృష్ణచైతన్య' విజయభేరి



డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో కృష్ణచైతన్య కళాశాల విద్యార్థులు యూనివర్శిటీ స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించి విజయభేరి మోగించారని కళాశాల డైరెక్టర్లు ఆర్‌వి కృష్ణారెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. బిఎస్సీలో బి.మనోజ్ఞ, ఎ.సాహితి 99.7 శాతం, ఎ.తేజస్విని, పి.గాయత్రి, ఎస్‌కె రజియా 99.3 శాతం, ఎ.సింధు, ఎ.జ్యోతిక, ఎన్.కుసుమ, వై.తేజస్విని, వి.సుమ 99శాతం మార్కులు సాధించారని పేర్కొన్నారు. అదేవిధంగా బిబిఏలో ఎస్‌కె తాహిరాబాను 96శాతం, షేక్ అస్మిన్‌వాలా 95.6శాతం, బి.రేఖాసుతార్, ఎస్‌కె యాస్మిన్‌లు 95.4 శాతం, బిసిఏలో ఆర్.మీనాక్షి 99.6, ఎ.అఖిల, ఎన్.సాయిప్రియ 99, ఎస్‌కె రీఫా, పి.దీపిక 98.8, పి.గీతిక 98.7, ఎస్‌డి నుస్రత్, పి.పూజిత 98.4 శాతం, డి.సుజిత, ఎస్‌కె సఖియాతస్మన్, ఎస్‌కె రేష్మా 98 శాతం వంతున మార్కులు సాధించారని తెలిపారు. బికాంలో అరవ నీరజ 98శాతం, కె.ఐశ్వర్య 97శాతం, బి.తులసి, ఎస్‌కె అస్మత్ 95.5 శాతం, ఎస్‌కె యాస్మిన్ 94.8 శాతం, షేక్ షరీన్ 94 శాతం మార్కులు సాధించి అందరి ప్రశంసలు అందుకున్నారని తెలిపారు.

# రాయాజీ వీధిలో టెరిఫిక్ ట్రాఫిక్

## రక్షించండి మహాప్రభో...!

నెల్లూరు నగర నడిబొడ్డులో ప్రఖ్యాతి చెందిన రాయాజీ వీధిలో ట్రాఫిక్ నిత్యం నరకం చూపిస్తోందని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. ఆంజనేయస్వామి దేవాలయం మీదుగా పెద్ద పోస్టాఫీసు, కలెక్టర్ కార్యాలయం, చిన్నబజారుకు వెళ్ళే ఏకైక ప్రధాన లింకురోడ్డు రాయాజీ వీధి. ఇక్కడ ఇష్టానుసారంగా తవ్వకాలు, రోడ్డుపైనే నిర్మాణ సామాగ్రి, ఎక్కడపడితే అక్కడ వాహనాల నిలిపివేత వల్ల నిత్యం టెరిఫిక్ ట్రాఫిక్‌తో అల్లాడిపోతున్నామని, అధికారులు, ట్రాఫిక్ పోలీసులు పట్టించుకుని తమ రోడ్డులో ట్రాఫిక్ ఇబ్బందులనుండి రక్షించాలని ఆ రోడ్డు నివాసితులు కోరుతున్నారు.




# భగవాన్ వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు రద్దు

ఈనెల 18 నుంచి 24వ తేది వరకు జరగాల్సిన గొలగమూడిలోని అవధూత భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలను రద్దుచేసినట్లు ఆలయ ఇ.ఓ బాల సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. కరోనా నేపథ్యంలో స్వామివారి ఉత్సవాలను రద్దు చేస్తున్నామని, కోవిడ్ నిబంధనలను పాటిస్తూ ఉదయం 6.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు భక్తుల దర్శనార్థం మందిరం తెరచి ఉంచుతామని పేర్కొన్నారు.

# 'నవరత్నాల'పై షార్ట్‌ఫిల్మ్ పోటీలు



రాష్ట్రంలో అమలవుతున్న 'నవరత్నాలు', మహిళాభివృద్ధి, సంక్షేమ పథకాలపై షార్ట్‌ఫిల్మ్-2021 పోటీలకు ఏపీ చలనచిత్ర, టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఆ మేరకు మంగళవారం సంస్థ ఎం.డీ ప్రకటన విడుదల చేశారు. మహిళా నిర్మాతలు, మహిళా సంస్థల ఆధ్వర్యంలో తెలుగులో రూపొందించిన లఘు చిత్రాలు మూడు నుంచి నాలుగు నిమిషాల నిడివితో ఉండాలని సూచించారు. నవంబర్ 30వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు కాపీతో పాటు షార్ట్‌ఫిల్మ్ కంటెంట్‌ను డీవీడీ/పెన్‌డ్రైవ్, బ్ల్యూరే ఫార్మాట్లలో డిసెంబర్ 31లోగా తమ కార్యాలయానికి పంపాలని కోరారు. వివరాలకు www.apsftvtdc.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

# నెల్లూరు నుంచి తిరుపతికి.. జన ఆశీర్వాద్ యాత్ర



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తిరుపతిలో చేపట్టిన జన ఆశీర్వాద యాత్రకు నెల్లూరులోని బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్ళారు. ఈ సందర్భంగా నెల్లూరు నగరంలోని చిల్డ్రన్స్‌పార్కు వద్ద జాతీయరహదారిపై బయలుదేరిన జన ఆశీర్వాద యాత్రను ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. నెల్లూరు నుంచి తిరుపతి వరకు సుమారు వంద కార్లతో ఈ యాత్రను చేపట్టారు. బిజెపి నెల్లూరు పార్లమెంటరీ అధ్యక్షుడు భరత్‌కుమార్‌యాదవ్, నాయకులు మిడతల రమేష్, మొగరాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## సొంత ఊరికి..

# ఇక.. ఎక్కడి నుంచైనా వైద్యసేవలు

- త్వరలో అందుబాటులోకి తెస్తున్న ప్రభుత్వం
- ప్రత్యేక యాప్ ఏర్పాటుకు అన్ని ఏర్పాట్లు

**ఇరుగు పొరుగు రాష్ట్రాలు, ఇతర రాష్ట్రాల్లో ఉంటూ, తమ సొంత వూరికి, సొంత రాష్ట్రంలోని ప్రజలకు వైద్యసేవలను అందించాలనే వైద్యులకు ఇది శుభ వార్త. తాము దూరప్రాంతాల్లో ఉన్నప్పటికీ తమ వాళ్ళకి వైద్యసేవలు అందించాలనుకునే ఆసక్తి కలిగిన వైద్యులందరికీ చక్కని అవకాశం కల్పిస్తోంది రాష్ట్ర ప్రభుత్వం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో జరుగుతున్న ఈ ఏర్పాట్లు మొత్తంగా వైద్యరంగానికే మార్గదర్శకం కానున్నాయి కూడా.**

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వైద్యులతో కన్సల్టెన్సీ సేవలను అందించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక యాప్‌ను తయారుచేస్తోంది. తక్కువ బ్యాండ్ విడ్త్ ఉన్నా ఇది ఎంతో ఉపయోగపడుతుంది. ఏపి టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ ద్వారా అభివృద్ధి చేసిన ఈ యాప్‌తో తమకు దూరంగా ఉన్న తమ సొంతవూర్లలో ఉన్న వారికి, సొంతవారికి వైద్యసేవలు సులభంగా అందించడానికి ఈ యాప్ రూపొందిస్తున్నారు. ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే చాలు.. ఇంటర్నెట్ వేగం తక్కువగా ఉన్నా, వీడియో కాన్ఫరెన్స్ ఎంపిక చేసుకున్న డాక్టర్లతో వైద్యసేవలను, ఈ–ప్రిస్కిప్షన్లను వెనువెంటనే పొందవచ్చునని ఆ టెక్నాలజీస్ ఎం.డి నందకిషోర్ స్పష్టం చేశారు. ఈ యాప్ వినియోగించడం తెలియనివారి కోసం ప్రత్యేకించి రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామంలో నిర్మిస్తున్న విలేజ్ క్లినిక్‌లకు అనుసంధానం చేయాలని కూడా భావిస్తున్నారు. వైద్యసేవలు అవసరమైన వారు అక్కడి నుంచి నేరుగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వైద్యసేవలు పొందేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికోసం ఆర్‌ఎక్స్ టెలికేర్ సంస్థతో ఏపిటిఎస్, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ కూడా ఒప్పందం చేసుకుందని, ఈ యాప్‌ను కోవిడ్ సమయంలో పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలు చేసి సత్ఫలితాలు సాధించినట్లు ఆయన వివరించారు. ఈ సేవలను రాష్ట్రవ్యాప్తంగా అమలులోకి తీసుకువచ్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషిచేస్తున్నారని, త్వరలోనే సిఎం చేతుల మీదుగా ఈ యాప్ ప్రారంభమవుతుందని ఆయన వివరించారు.

### యాప్‌లో పేరు నమోదు చేసుకుంటే చాలు

ఒక్కసారి ఈ యాప్‌లో పేరు నమోదు చేసుకుంటే చాలు యాప్ అందుబాటులోకి వస్తుంది. కాల్ చేస్తే సంబంధిత వైద్యులు రోగి సమాచారమంతా తీసుకుని, ఏ విభాగానికి చెందిన డాక్టర్‌ను సంప్రదించాలో నిర్ణయించి అపాయింట్‌మెంట్ ఇస్తారు. ఆ సమయంలో రోగి తన ఇంటి వద్ద నుంచి కానీ, విలేజ్ క్లినిక్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కానీ నేరుగా డాక్టర్‌తో మాట్లాడే అవకాశం ఉంటుంది. రోగిని పరిశీలించిన తర్వాత చికిత్సకు సంబంధించిన ఇ–ప్రిస్కిప్షన్ కూడా ఆన్‌లైన్‌లో అందిస్తారు. దీనిని అన్ని మందుల షాపుల వారు అనుమతిస్తారు. ఒకేసారి రోగి బంధువులతో కలసి గ్రూప్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనడం, అప్పటికప్పుడు రోగికి సంబంధించి ఏవైనా ఇన్‌ఫెక్షన్లు వగైరాలుంటే ఫోటో తీసి భద్రపరుచుకునే వెసులుబాటు కూడా ఉంటుంది. అన్నిటికీ మించి రోగికి సంబంధించిన సమాచారమంతా భద్రంగా ఉంటుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో పూర్తి రక్షణ ఉండే విధంగా క్లౌడ్ స్టోరేజ్‌లో ఉంచుతారు. సమాచారాన్ని డేటా ఎనలిటిక్స్ ద్వారా విశ్లేషించి రోగ లక్షణాలను ముందుగానే గుర్తించడం, తదుపరి చికిత్సలను సూచించడం, వారసత్వంగా వచ్చే వ్యాధులను నియంత్రించడం వంటి సౌకర్యాలన్నీ యాప్‌లో ఉండేవిధంగా ఏర్పాట్లు చేస్తుండడం విశేషం.

# తగ్గనే తగ్గనంటున్న కరోనా

**జిల్లాలో మరో ఇద్దరు మృతి**

నెల్లూరుజిల్లాలో కరోనా ఉధృతి తగ్గడమే లేదు. ఏరోజు కారోజు తగ్గుతున్నట్లు అనిపిస్తుందే కాని, కేసులు మాత్రం పెరిగిపోతూనే ఉన్నాయి. కావలిలో పోలీస్‌స్టేషన్‌లో ఉన్న 9మంది అధికారులు, సిబ్బందిని కరోనా వణికిస్తూనే ఉంది. ఈ నెల 19 గురువారం నాటికి జిల్లావ్యాప్తంగా 242 కరోనా పాజిటివ్ కేసులు నమోదు కాగా, ఇద్దరు మృత్యువాత పడ్డారు. జిల్లాలో ఇప్పటివరకు 1,38,346 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. వీటిలో 1,34, 753 మంది కోవిడ్ నుండి కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు. ఏదేమైనా కరోనా పట్ల అందరూ అప్రమత్తంగా ఉండి కోవిడ్ నిబంధనలు పాటించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## శ్రీ సాయిదర్బార్ అద్దాల మందిరంలో

# నిత్య అన్నప్రసాద నిలయం

- 25న నూతన భవనం ప్రారంభం
- 26న పెనుశిల లక్ష్మీనరసింహస్వామి కల్యాణం





నెల్లూరు, పద్మావతి నగర్‌లోని శ్రీ సాయి దర్బార్ అద్దాల మందిరంలో శ్రీ సాయిమాత నిత్య అన్నప్రసాదాలయం నూతన భవనానికి ఈ నెల 25వ తేదీ బుధవారం రాత్రి 7.47 గంటల నుండి 9.18 నిమిషాలలోగా ప్రారంభోత్సవం జరుగుతుందని ఆలయ నిర్వాహకుడు మధుసాయి తెలియజేశారు. శ్రీ సాయినాథుని కృపా కటాక్షాలతో, భక్తుల సహకారంతో, ప్రధానంగా సాయిదర్బార్ గౌరవసలహాదారుడు, ఆధ్యాత్మిక చింతనా తత్పరుడు పాబోలు రామసుబ్బయ్య దాతృత్వంతో, వారి కుటుంబసభ్యుల సాయంతో ఈ భవన నిర్మాణం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆ రోజు రాత్రి 8 గంటలకు గోపూజ, 8.28 గంటలకు అన్నప్రసాద ఆలయ ప్రవేశం జరుగుతుందన్నారు.

### 26న శ్రీ పెంచలస్వామి కల్యాణోత్సవం

26వ తేదీ ఉదయం 6 నుండి 8.30 వరకు శ్రీ సాయినామ కీర్తన, అనంతరం శిరిడి నుండి వచ్చిన శ్రీ ద్వారకామాయి సాయినాథ్ మహారాజ్ వారి చిత్రపటం మంగళవాద్యాలతో, శ్రీ సాయి నామ సంకీర్తనతో ఊరేగింపు జరుగుతుందన్నారు. అన్నప్రసాదాలయంలో బాబా వారి చిత్రపటం ఆవిష్కరణ జరుగుతుందని, ఉదయం 9.30 గంటలకు శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తామని తెలియజేశారు. మధ్యాహ్నం 12.00గంటలకు భక్తులందరికీ అన్నప్రసాద వినియోగం జరుగుతుందని మధుసాయి తెలియజేశారు. భక్తులందరూ పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

# సెప్టెంబర్‌లో రచ్చబండ

**జిల్లా కలెక్టర్ చక్రధరబాబు**

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా వచ్చే సెప్టెంబర్‌లో రచ్చబండ కార్యక్రమం మొదలు కానుందని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు వెల్లడించారు. ఇటీవల కలెక్టరేట్ తిక్కన ప్రాంగణంలో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వచ్చే సెప్టెంబరు మాసంలో రచ్చబండ కార్యక్రమం చేపట్టే అవకాశం ఉందన్నారు. అందుకోసం జిల్లాలో ఏదో ఒక గ్రామం ఎంపిక చేస్తారని, రచ్చబండ కార్యక్రమం నిర్వహణకి అధికారులందరూ సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు.

# కరోనాను తరిమేద్దాం

**- కమిషనర్ దినేష్‌కుమార్**



నగర పాలక సంస్థ పరిధిలోని ప్రతిఒక్కరూ కోవిడ్ వ్యాక్సినేషన్ వేయించుకుని కరోనాను తరిమికొట్టాలని కరోనా రహిత నగరంగా నెల్లూరును తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ నెల 19వ తేదీ గురువారం నెల్లూరు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశ మందిరంలో హెల్త్ సెక్రటరీలు, డివిజన్ ఇన్‌ఛార్జిలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర వ్యాప్తంగా మొదటి, రెండవ విడత కోవిడ్ వ్యాక్సిన్‌లను 4లక్షల మందికి ఇప్పటిదాకా వేశారని, కోవిడ్ టీకాపై అపోహలు తొలగించుకుని 18 సంవత్సరాలు దాటిన ప్రతిఒక్కరూ స్థానిక ఆరోగ్య కేంద్రాల్లో వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. మాస్కు ధారణ, తరచూ శానిటైజర్‌లు ఉపయోగించడంతో పాటు వ్యాక్సిన్ తప్పనిసరిగా తీసుకున్నప్పుడే కరోనా మహమ్మారిని పూర్తిస్థాయిలో నివారించగలమని కమిషనర్ స్పష్టం చేశారు. సమావేశంలో ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో ఆరోగ్య రక్ష సమితులు

**- డాక్టర్ సివి సుబ్రహ్మణ్యం**



కరోనా మూడో దశను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు అందరూ తగు జాగ్రత్తలు పాటించాలని, అందుకోసం గ్రామగ్రామానా ఆరోగ్య రక్ష సమితులు ఏర్పాటుచేస్తామని జిల్లా ఆరోగ్య రక్ష సమితి అధ్యక్షుడు డాక్టర్ సి.వి సుబ్రహ్మణ్యం సూచించారు. ఈనెల 18న ఆయన నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గత రెండేళ్ళుగా కోవిడ్ బాధితులకు సేవలందిస్తున్న స్వచ్ఛంధసంస్థల వారు కోవిడ్ థర్డ్ వేవ్‌ను ఎదుర్కొనేందుకు ఆరోగ్య రక్ష సమితితో కలసి పనిచేయాలని కోరారు. సెప్టెంబర్ 1 నుంచి 7వ తేది వరకు ఆరోగ్య జన జాగరణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో సంస్థ కన్వీనర్ ఎం.వ్యాస ప్రసాద్, కో–కన్వీనర్ బి.మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హెడ్ కానిస్టేబుళ్ళయిన కానిస్టేబుళ్ళు

జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్న ఆరుగురికి హెడ్ కానిస్టేబుళ్ళుగా ఉద్యోగోన్నతి కలిగిస్తూ ఈనెల 18న జిల్లా ఎస్పీ సిహెచ్ విజయారావు ఉత్తర్వులిచ్చారు. ఉద్యోగోన్నతి పొందిన వారిలో షేక్ గులాబ్ హుస్సేన్ (గూడూరు 2వ పట్టణం), ఏఎస్‌ఏ అబ్దుల్ (నెల్లూరు రూరల్), పి.ఆదినారాయణ (గూడూరు రూరల్), వి.ఆనందబాబు, ఎం.మస్తానయ్య( వెంకటాచలసత్రం), పి.యజ్దానిబాషా (ఇందుకూరుపేట)లు ఉన్నారు.

# ఎన్‌జిఓ సంఘం నేత..రాంబాబు అస్తమయం



జిల్లా ఎన్‌జిఓల సంఘం నేతగా, రాష్ట్ర స్థాయి నాయకునిగా ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసిన ఏపి ఎన్‌జిఓల సంఘం జిల్లా శాఖ మాజీ అధ్యక్షుడు రాయసం రాంబాబు ఈనెల 18వ తేదీన గుండెపోటుతో మృతిచెందారు. అల్లూరు మండలంలోని పురిణి గ్రామంలో గురువారం ఆయన అంత్యక్రియలు జరిగాయి. రాంబాబు మృతి ఎన్‌జిఓల సంఘానికి తీరని లోటని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్‌జిఓల సంఘం నాయకులు పూర్ణచంద్రరావు, అల్లంపాటి పెంచలరెడ్డి, చేజర్ల సుధాకర్‌రావు తదితరులు రాంబాబు మృతికి విచారం ప్రకటిస్తూ వారి కుటుంబానికి తమ సంతాపం తెలియజేశారు.

# ఉపరాష్ట్రపతిని కలిసిన నెల్లూరి చిన్నారి



ప్రముఖ పారిశ్రామికవేత్త, విద్యావేత్త, సౌమ్యశీలి, స్నేహశీలి మైపాడు వాస్తవ్యులు కీర్తిశేషులు నారపరెడ్డి కోదండరామిరెడ్డి మనుమరాలు చిన్నారి వినూష ఆగష్టు 19వ తేదీ గురువారం ఉదయం భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడిని బెంగుళూరులో కలుసుకుంది. తమ తాత డాక్టర్ పూండ్ల శ్రీనివాసులరెడ్డి (అమ్మ నాన్న), నాన్న నారపరెడ్డి వినోద్‌రెడ్డి, అమ్మ షాలిని, అన్నయ్య విశాల్‌లతో కలసి ఆమె ఉపరాష్ట్రపతిని కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె తన స్నేహితురాలు మరో నెల్లూరు చిన్నారి పల్లంరెడ్డి అన్యరెడ్డితో కలసి చిన్నతరహా వ్యాపారాలపై రూపొందించిన 'ది డిజిటైసింగ్ మైక్రో బిజినెస్' ప్రతిని వెంకయ్యకు అందించింది. చిన్న వయసులో వినూష చేసిన ప్రయత్నాన్ని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు మెచ్చుకుని ఆ చిన్నారిని అభినందించారు.

# అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి

## - అధికారులకు సిఐడి అదనపు డీజీ సునీల్‌కుమార్ ఆదేశం



అగ్రిగోల్డ్ బాధితులకు త్వరలోనే న్యాయంచేసే విధంగా సంబంధిత అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని సిఐడి అదనపు డీజీ సునీల్ కుమార్ ఆదేశించారు. ఈనెల 18న ఆయన సిఐడి ఎస్పీ సరితతో కలసి నెల్లూరులోని సిఐడి కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అగ్రిగోల్డ్ బాధితుల నమోదుకు సంబంధించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సిఐడి కార్యాలయంలో జరుగుతున్న అగ్రిగోల్డ్ బాధితుల నమోదు కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. అగ్రిగోల్డ్ బాధితులందరికీ న్యాయం చేయాలని, ఏ ఒక్కరూ నష్టపోకుండా చూడాలని, అధికారులు సిబ్బంది ఈ విషయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట నెల్లూరు సిఐడి ఏఎస్పీ రాజేంద్రకుమార్, డిఎస్పీ రాంబాబు, సిఐలు రవినాయక్, నాగభూషణం, బాబీ తదితరులు పాల్గొన్నారు.




## టిటిడి ఛైర్మెన్‌కు కిలివేటి శుభాకాంక్షలు

తిరుమల తిరుపతి దేవస్థానాల పాలకమండలి ఛైర్మెన్‌గా రెండవసారి బాధ్యతలు చేపట్టిన వై.వి సుబ్బారెడ్డిని ఇటీవల మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేసిన సూళ్లూరుపేట శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య









Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com